PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 33 | విజయవాడ, సోమవారం 2 సెప్టెంబర్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 2 September 2024 | Rs

బ్యాడ్మింటన్ ఫైనల్‌కు నితీశ్
- సెమీస్‌కు మనీషా
- పారిస్ పారా ఒలింపిక్స్

6

విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ ముంపు ప్రాంతాల్లో బోటులో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ముంచెత్తిన వరద

- విజయవాడ అతలాకుతలం
- సింగ్‌నగర్ విలవిల
- గంటగంటకూ పెరుగుతున్న వరద ఉధృతి
- స్కూళ్లకు నేడు సెలవు
- పలు రైళ్ల రద్దు
- ఇద్దరు గల్లంతు
- వరద ప్రాంతాల్లో రెండుసార్లు పర్యటించిన సిఎం
- జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేంద్రానికి విజ్ఞప్తి

బుడమేరు ముంపుతో సముద్రాన్ని తలపిస్తున్న విజయవాడ సమీపంలోని రాయనపాడు, ఈలప్రోలు, గొల్లపూడి, జక్కంపూడి తదితర ప్రాంతాలు

వర్షాలు, వరదలతో విజయవాడ, ఆ పరిసర ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. బుడమేరు పొంగిపొర్లడంతో విజయవాడ నగరం ముఖ్యంగా సింగ్‌నగర్ వరద నీటిలో చిక్కుకుంది. ప్రకాశం బ్యారేజి దిగువన ఉన్న లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రకాశం బ్యారేజికి 12.30 గంటల సమయానికి 10.56 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చింది. వచ్చిన నీటిని వచ్చినట్టు విడిచిపెడుతున్నారు. జాతీయ రహదారికి పలుచోట్ల గండిపడటంతో విజయవాడ-హైదరాబాద్ మధ్య రాకపోకలు స్తంభించాయి. పలు రైళ్లు రద్దు చేశారు. వరద తీవ్రతను దృష్టిలో పెట్టుకుని సోమవారం స్కూళ్లకు సెలవు ప్రకటించింది. గంటగంటకూ వరద ఉధృతి పెరుగుతుండటంతో కృష్ణా పరివాహక ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సింగ్‌నగర్, ఇతర వరద ముంపు ప్రాంతాల్లో రెండుసార్లు పర్యటించారు. దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించి, ఆదుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి ఆరు హెలీకాప్టర్లు, పది ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, 40 పవర్ బోట్లు సహాయక చర్యల కోసం రానున్నాయని సిఎం తెలిపారు. మరోవైపు సహాయక చర్యల్లో అధికార యంత్రాంగం తలమునకలైంది. విద్యుత్ సరఫరా స్తంభించిపోవడంతో చాలా ప్రాంతాలు అంధకారంలో చిక్కుకున్నాయి. తాగునీరు, ఆహారం అందక బాధితులు ఇబ్బందిపడుతున్నారు. రాష్ట్రంలో పలు జిల్లాలను కుదిపేసిన అల్పపీడనం ఆదివారం తెల్లవారుజామున కళింగపట్నం వద్ద తీరం దాటింది. వచ్చే 24 గంటల వరకూ ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. వర్షాలు, వరదలకు అపారమైన ఆస్తినష్టం, ప్రాణనష్టం, పంట నష్టం సంభవించినట్లు ప్రాథమిక అంచనా. సింగ్‌నగర్‌లో ఓ మహిళ మృతదేహం కొట్టుకురాగా, మరో యువకుడు గల్లంతయ్యాడు. ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం జూపూడిలో విద్యుత్ లైన్‌మేన్ కోటేశ్వరరావు ట్రాన్స్‌ఫార్మర్‌పై విధులు నిర్వహిస్తూ, వరద నీటిలో పడి గల్లంతయ్యారు. కృష్ణా నదికి 11 లక్షల క్యూసెక్కులకుపైగా వరద నీరు వచ్చే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

వార్త లోపలి పేజీలో

గుంటూరు జిల్లా రాయపూడి లంకవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది

మళ్లీ బాదుడు షురూ !

- కమర్షియల్ గ్యాస్ బండపై రూ.39 పెంపు

న్యూఢిల్లీ : కేంద్రంలోని బిజెపి నేతృత్వ ఎన్‌డిఎ ప్రభుత్వం మళ్లీ ధరల మోత మొదలుపెట్టింది. వాణిజ్య వంట గ్యాస్ సిలిండర్ ధరను ఏకంగా రూ.39 పెంచేసింది. బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇంధన ధరలు పెంచుతూ పోయిన సర్కార్ సార్వత్రిక ఎన్నికల దరిమిలా కొంతకాలం మినహాయింపు ఇచ్చింది. ఇప్పుడు వరుసగా గత ఆగస్టులోనూ, ఇప్పుడు రెండు దఫాలు ధరలను పెంచేసింది. అంతర్జాతీయ, జాతీయ పరిణామాల ఆధారంగా ప్రతి నెలా ఒకటో తేదీన చమురు కంపెనీలు ధరలను సవరిస్తాయి. ఈ క్రమంలోనే వాణిజ్య అవసరాల కోసం వినియోగించే 19 కిలోల వంటగ్యాస్ ధరను ఒక్కో సిలిండర్‌పై రూ.39 పెంచాయి. దీని ప్రభావం ఆహార పదార్థాలపైనా పడే వీలుంది. పెంచిన ధరలు ఆదివారం తెల్లవారుజాము నుంచే అమలులోకి వచ్చాయి. తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో ఒక్కో వాణిజ్య సిలిండర్ రేటు రూ.1,691.50కు పెరిగింది. విజయవాడలో రూ.1848కి, చెన్నైలో రూ.1,855, కోల్‌కతాలో రూ.1,802.50, ముంబయిలో రూ.1,644కు ధర ఎగబాకింది. తాజా పెంపునకు కారణాలేమిటనేది కూడా చమురు సంస్థలు వెల్లడించకపోవడం గమనార్హం.

తెలంగాణలో భారీ వర్షాలు

- తెలుగు రాష్ట్రాల మధ్య నిలిచిన రాకపోకలు
- తొమ్మిది మంది మృతి
- జల దిగ్బంధంలో ఖమ్మం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ వ్యాప్తంగా గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తొమ్మిది మంది మృతి చెందారు. ఏకధాటిగా కురిసిన కుంభవృష్టికి వాగులు, వంకలు పొర్లి వరద సమీప గ్రామాలపై పడడంతో ఇళ్లు నీటమునిగాయి. వేలాదిమంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. వరద నీటిలో వాహనాలు కొట్టుకుపోయాయి. గాలి వానకు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో భారీ నష్టం వాటిల్లింది. అన్ని జిల్లాల్లోని ప్రాజెక్టుల గేట్లు తెరిచి వరద నీటిని దిగువకు వదులుతున్నారు. నల్గొండ జిల్లా కోదాడలో వరద తాకిడికి ఇద్దరు గల్లంతయ్యారు. ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన కార్లు, బైకులు కొట్టుకుపోయాయి. తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతం రామాపురం వద్ద జాతీయ రహదారిపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండంతో పోలీసులు రాకపోకలను నిలిపివేశారు. పాలేరు వాగు వరద రోడ్డును ముంచెత్తడంతో ఖమ్మం-సూర్యాపేట రహదారిని మూసివేశారు. ఎగువ నుంచి వరదకు తోడు ఖమ్మం పట్టణంలో శనివారం రాత్రి భారీ వర్షం కురవడంతో మున్నేరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. రాజీవ్ గృహకల్ప కాలనీ, వెంకటేశ్వర నగర్, గణేష్ నగర్, దానవాయిగూడెంలో పలు అపార్టుమెంట్లను వరద ముంచెత్తింది. సూర్యాపేట జిల్లా నల్లబండగూడెం వద్ద పాలేరు వాగులో ఆర్‌టిసి బస్సు చిక్కుకుపోయింది. బస్సులోని 30 మంది ప్రయాణికులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. తెలంగాణ సరిహద్దు నల్లబండగూడెం వద్ద జాతీయ రహదారిపై వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో, హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను నార్కట్‌పల్లి-అద్దంకి వైపు, విజయవాడ నుంచి వచ్చే వాహనాలను అద్దంకి-నార్కట్‌పల్లి

మిగతా 5లో

ఖమ్మంలో..

ధ్వంసమైన రైల్వే ట్రాక్

పోలీసుల తీరు చక్కదిద్దాలి

- గుడ్లవల్లేరు ఘటనపై డిజిపికి ఐద్వా లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులోని శేషాద్రిరావు ఇంజినీరింగు కళాశాల విద్యార్థులపై అనుచితంగా వ్యవహరిస్తున్న స్థానిక పోలీసు అధికారుల తీరును చక్కదిద్దాలని ఐద్వా రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు డిజిపి తిరుమలరావుకు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి ఆదివారం లేఖ రాశారు. బాలికల వసతిగృహం కామన్ బాత్‌రూమ్‌లలో హిడెన్ కెమెరాలు ఏర్పాటు ఘటనలో విద్యార్థినుల ఫిర్యాదులపై యాజమాన్యం సక్రమంగా వ్యవహరించలేదని విమర్శించారు. కెమెరాల విషయంలో ఫిర్యాదు అందినా స్పందించకపోవడంతో సమస్య రోడ్డున పడిందని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కోరిన విద్యార్థినులపైనే కేసులు పెడతామని పోలీసుల బెదిరింపుల వీడియోలు వచ్చాయని పేర్కొన్నారు. తీవ్ర భయాందోళనకు గురైన విద్యార్థులకు భరోసా కల్పించి, వారి భయాన్ని పోగొట్టాల్సిన స్థానిక పోలీసు అధికారులు వారిని మరింత బెదిరిస్తున్నారని తెలిపారు. కళాశాల వసతి గృహంలో కెమెరాల ఘటనపై పోలీస్ అధికారులు విచారణ కొనసాగిస్తున్నట్లు ప్రకటించారని పేర్కొన్నారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లను సరిగ్గా పరిశీలించేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ వార్తలకు ఆధారాలేమిటో పోలీసులు సేకరించేందుకు తగు శ్రద్ధతో పనిచేయాలని సూచించారు. ఆ నమ్మకాన్ని విద్యార్థినులకు కలిగించాలని తెలిపారు. ఈ విషయంలో జోక్యం చేసుకుని స్థానిక అధికారులకు సరైన ఆదేశాలిచ్చి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

నష్టపోయిన వారిని ఆదుకోండి
- ముంపు ప్రాంతాలను పరిశీలించిన సిపిఎం బృందం

3

యుద్ధం వద్దు.. శాంతి కావాలి
- సిఐటియు ఆధ్వర్యంలో శాంతి సంఘీభావ ర్యాలీలు

5

ఎత్తిపోతల పథకాన్ని పున: ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ఎత్తిపోతల పథకాల ప్రయివేటీకరణ

- మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా)

ఎత్తిపోతల పథకాలను ప్రయివేటీకరించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలంలో చిన్నసాన ఎత్తిపోతల పథకాన్ని ఆదివారం ఆయన పున:ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎత్తిపోతల పథకాల ప్రయివేటీకరణతో రైతులకు మేలు చేకూరుతుందని, ఆయకట్టు భూములకు పూర్తి స్థాయిలో సాగు నీరందుతుందని చెప్పుకొచ్చారు. 2,200 ఎకరాలకు సాగు నీరందించే చిన్నసాన ఎత్తిపోతల పథకాన్ని 2018లో రూ.25 కోట్లతో ప్రారంభించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలను నిర్వీర్యం చేసి, రైతులకు సాగునీరందకుండా చేసిందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం చేసిన పథకాలను పున:ప్రారంభిస్తున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పున:ప్రారంభాల ట్రెండ్ నడుస్తోందని పేర్కొన్నారు. త్వరలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఎత్తిపోతల పథకం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, మాజీ ఎంపిపిలు టి.రామకృష్ణ, వి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గాజాలో పోలియో టీకా కార్యక్రమం ప్రారంభం

జెరూసలేం : గాజా స్ట్రిప్‌లో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో పోలియో టీకాల కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. ఐక్యరాజ్యసమితి విజ్ఞప్తి మేరకు ఇరుపక్షాలు 'మానవతా విరామం' ప్రకటించడంతో టీకాల కార్యక్రమానికి మార్గం సుగమమైనట్లు గాజా ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. ఇజ్రాయిల్ గత 11 మాసాలుగా సాగిస్తున్న దాడులు, మానవతా సాయం అందకుండా విధించిన ఆంక్షల మూలంగా దాదాపు 25 ఏళ్ల తరువాత గాజాలో పిల్లలు పోలియో బారిన పడుతున్నారు. గత నెలలో ఇక్కడ తొలి పోలియో కేసు నమోదైంది. సెంట్రల్ గాజాలోని మూడు ఆరోగ్య కేంద్రాల్లో ఆదివారం ఉదయం 9 గంటలకు టీకాల కార్యక్రమం ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే 12 లక్షలకు పైగా వ్యాక్సిన్‌లు గాజాకు చేరుకున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. 6,40,000 మంది పదేళ్లలోపు పిల్లలకు వ్యాక్సిన్‌ను పంపిణీ చేసేందుకు ప్రణాళిక రూపొందించారు.

వేట నిషేధ భృతి రూ.20 వేలు చెల్లించాలి

- అఖిల భారత మత్స్యకారుల, మత్స్యకార్మికుల సమాఖ్య డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని మత్స్యకారులకు తక్షణం 2024 చేపల వేట నిషేధ భృతి రూ.20 వేలను చెల్లించాలని అఖిల భారత మత్స్యకారుల, మత్స్యకార్మికుల సమాఖ్య డిమాండ్ చేసింది. కర్ణాటకలోని ఉడిపిలో శని, ఆదివారాల్లో సమాఖ్య జాతీయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో ఇన్‌లాండ్, మెరైన్ మత్స్యకారుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా అఖిల భారత మత్స్యకారుల, మత్స్యకార్మికుల సమాఖ్య జాతీయ కార్యదర్శి మమత మాట్లాడుతూ... రాష్ట్రంలో 2024 చేపల వేట నిషేధం జూన్ 15 ముగిశాక రెండు నెలలు దాటినా ఇప్పటికీ నిషేధ భృతి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం మత్స్యకారులకు నిధుల కేటాయింపుల్లో అన్యాయం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా బడ్జెట్‌లో సుమారు రూ.5 వేల కోట్లు కేటాయించాలని కోరారు. మత్స్యకారులకు బోట్లు, వలలు, ఇతర ముడిసరుకులను సబ్సిడీపై ఇవ్వాలన్నారు. తీర ప్రాంతాల్లోని పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌లు, మార్కెట్ కూడళ్లలో గంజాయి అక్రమ రవాణా ఎక్కువ సాగుతోందని, గంజాయి ద్వారా మత్స్యకారుల జీవితాలు దుర్భరం అవుతున్నాయని తెలిపారు. ఈ ప్రాంతాల్లో గంజాయి అక్రమ రవాణా నివారణకు సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. మహిళలపై అత్యాచారాలు, దాడులు, పెత్తందారీతనాన్ని ప్రభుత్వమే అరికట్టాలన్నారు. ఎపి మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విజయవాడలోని మహంతి చేపల మార్కెట్‌ను విస్తరించడంతోపాటు ఆధునికంగా తీర్చిదిద్దాలన్నారు. చేపల వ్యాపారం చేసుకునేవారికి ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లను సబ్సిడీపై ఇవ్వాలన్నారు. అలాగే వీరందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె చంద్రశేఖర్‌రావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్ రమణి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అఖిల భారత మత్స్యకారుల, మత్స్యకార్మికుల సమాఖ్య జాతీయ కార్యదర్శి మమత

నిండుకుండలా ప్రకాశం బ్యారేజ్

బుడమేరు ఉధృతితో ముంపునకు గురైన విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతం

విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

బెజవాడ గజగజ

- ముంచెత్తిన బుడమేరు
- జల దిగ్బంధంలో నగరం
- వరదలో కొట్టుకొచ్చిన మహిళ మృతదేహం
- ఇద్దరు గల్లంతు
- ఘాట్ రోడ్లపై విరిగిపడిన కొండ చరియలు

ప్రజాశక్తి - విజయవాడ, యంత్రాంగం

వర్షాల వల్ల వరదలతో విజయవాడ పూర్తి జల దిగ్బంధంలో చిక్కుకుపోయింది. నడుం లోతు నీటిలో నగరం తేలియాడుతోంది. గత 20 ఏళ్లలో ఎన్నడూలేని విధంగా ముంపునకు గురైంది. ఎన్‌టిఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాలు కూడా వరద తాకిడికి గురయ్యాయి. ఆదివారం ఉదయం ఊహించని విధంగా వచ్చిన బుడమేరు వరద ఉధృతితో విజయవాడ పరిసర ప్రాంతాల్లోని వేలాది ఇళ్లలోకి భారీగా నీరు చేరింది. కృష్ణా నది ఉధృతితో గుంటూరు, బాపట్ల జిల్లాలోని లంక గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. విజయవాడలోని వరద ప్రాంతాల్లో విద్యుత్తు సౌకర్యం నిలిచిపోవడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. మంచినీరు, ఆహారం కోసం అలమటిసు న్నాయి. ముఖ్యంగా విజయవాడ సింగ్‌నగర్ ప్రాంతాన్ని బుడమేరు ముంచెత్తింది. ఆ ప్రాంతానికి కొట్టువచ్చిన ఓ మహిళ మృతదేహం కారుపై ఇరుక్కుపోయింది. విజయవాడ రూరల్ మండలం పైడూరుపాడులో ఓ యువకుడు, ఇబ్రహీపట్నం మండలం జుపూడిలో విద్యుత్ లైన్‌మ్యాన్ వరద నీటిలో గల్లంతయ్యాడు. వరద ప్రభావిత ప్రాంతాల్లో కొన్ని పశువులు, కుక్కలు, కోళ్ల జాడ తెలియడం లేదు. ప్రజలు ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్గగుడి, కొండపల్లి ఘాట్ రోడ్లలో కొండచరియలు విరిగిపడ్డాయి. సుమారు ఎనిమిది డివిజన్లలోని 30 వేల కుటుంబాలకు చెందిన లక్ష మందికిపైగా ప్రజలు వరదలో నీటిలో చిక్కుకుపోయారు. ఇళ్ల చుట్టూ వరద నీరు నిల్చిపోయింది. కొన్ని ఇళ్లలోకి వరద నీరు చేరింది. సుమారు పది గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఆయా గ్రామాలతోపాటు నగరంలోనూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు చిమ్మచీకట్లో గడుపుతున్నారు. వరద ప్రాంతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించారు. బాధితులను తక్షణం అదుకోవాలని అధికారులను ఆదేశించారు.

ముందస్తు సమాచారం లేకుండానే గేట్లు ఎత్తివేత

గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో బుడమేరుకు భారీ వరద రావడంతో ఎన్‌టిఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెలగలేరు రెగ్యులేటర్ వద్ద అధికారులు ఒక్కసారిగా గేట్లు ఎత్తివేశారు. బుడమేరు వరద

బుడమేరు ఉధృతితో ముంపునకు గురైన విజయవాడ అజిత్‌సింగర్ ప్రాంతం

నీరు ఫెర్రీ వద్ద కృష్ణా నదిలోకి వెళ్లే విధంగా పదిహేనేళ్ల క్రితమే మళ్లించారు. అయితే, ప్రస్తుతం కృష్ణా నది తీవ్ర ఉగ్రరూపం దాల్చి పోటెత్తి ప్రవహిస్తుండడంతో ఫెర్రీ వద్ద నీరు వెనక్కి ఎగదన్నుతోంది. దీనికితోడు తెలంగాణ నుండి వచ్చే వాగుల నీరు కలవడంతో జి.కొండూరు మండలం వెలగలేరు వద్ద బుడమేరు గేట్లను అధికారులు ఎత్తివేశారు. దీంతో, వెలగలేరు, హెచ్ ముత్యాలంపాడు, కవులూరు - కొండపల్లి మధ్య సుమారు ఏడు చోట్ల గండ్లు పడ్డాయి. పలు చెరువుల కట్టలు తెగిపోయాయి. దీనిపై ప్రజలకు ఎటువంటి ముందస్తు సమాచారమూ ఇవ్వకపోవడం, బుడమేరు పరీవాహక ప్రాంతం ఆక్రమణలకు గురికావడంతో అనేక గ్రామాలతోపాటు విజయవాడ నగరం కూడా జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. వర్షం నీటితోపాటు ఓవైపు ఎన్‌టిటిపిఎస్ కూలింగ్ కెనాల్, బూడిద చెరువు, మరోవైపు బుడమేరు పోటెత్తడంతో ఇబ్రహీంపట్నం, కొండపల్లి గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కవులూరు, ఈలప్రోలు, రాయనపాడు, పైడూరుపాడు, గొల్లపూడి తదితర గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. వేలాది ఇళ్లు నీట మునిగి రాకపోకలు స్తంభించిపోయాయి. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. బాపట్ల జిల్లా పెసర్లంక అరవింద్ వారథి వద్ద కృష్ణా నదికి గండిపడింది. పోతర్లంక, కొల్లూరు, ఇతర లంక గ్రామాలకు చెందిన రహదారులు నీట మునిగిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. కృష్ణా నది ఉగ్రరూపం దాల్చడంతో గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలోని మహానాడులోకి వరద నీరు ప్రవేశించింది.

సహాయం అందక అవస్థలు

విజయవాడ నగర పరిధిలో సుమారు పది కిలోమీటర్లకుపైగా విస్తరించి ఉన్న బుడమేరు పరీవాహక ప్రాంతాన్ని వరద ముంచెత్తడంతో 57, 58, 59, 60, 61,62, 63, 64 డివిజన్ల పరిధిలోని కొత్త, పాత ఆర్‌ఆర్‌పేటలు, డాబకొట్లు సెంటర్, బుడమేరు మధ్యకట్ట, కండ్రిక, రాజీవ్‌నగర్, ప్రజాశక్తి నగర్, ఎల్‌బిఎస్ నగర్, శాంతినగర్, ఉడా కాలనీ, ఎంబి స్టేడియం, ఆంధ్రప్రభ కాలనీతోపాటు జక్కంపూడి తదితర ప్రాంతాల్లోకి ఐదారు అడుగుల ఎత్తు వరకూ వరద నీరు చేరింది. లోతట్టు ప్రాంతాల్లో పది అడుగుల ఎత్తు వరకూ నీరు నిల్చిపోయింది. బాధిత ప్రజలు ఉదయం నుంచి రాత్రి వరకు మంచినీరు, ఆహారం లేక జనం తల్లడిల్లిపోయారు. గుక్కెడు మంచినీటికి పిల్లలు, వృద్ధులు మహిళలు అల్లాడిపోతున్నారు. వరద ఉధృతికి సింగ్‌నగర్‌లోని విద్యుత్ కార్యాలయం, సబ్ స్టేషన్ కూడా మునిగిపోవడంతో అంధకారం నెలకొంది. ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది సహాయంతో నిరాశ్రయులను పడవల్లో ఎక్కించుకుని పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. వర్షాల కారణంగా ఎన్‌టిటిపిఎస్‌లో ఐదు యూనిట్లలో విద్యుదుత్పత్తికి అంతరాయం కలిగింది.

సహాయక చర్యలు చేపట్టండి : సిఎం చంద్రబాబు
విజయవాడ సింగ్‌నగర్‌లో పర్యటన

బుడమేరు వరద బాధితులకు తక్షణం సహాయక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. విజయవాడ సింగ్‌నగర్‌లోని బుడమేరు వరద ప్రభావిత ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఆయన పర్యటించారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ బోట్లో లైఫ్ జాకెట్ వేసుకుని ముంపు ప్రాంతాల ప్రజలను సందర్శించారు. ఆయనతోపాటు మంత్రులు కె.నారాయణ, కొల్లు రవీంద్ర, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఉన్నారు. ముందుగా ఆయన విజయవాడ కనకదుర్గ వారధి వద్ద కృష్ణా నది వరద ఉధృతిని పరిశీలించారు. అనంతరం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్‌కు వచ్చారు. బుడమేరు మునక ప్రాంతంలో చేపట్టాల్సిన సహాయక చర్యలపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడతూ ఎన్నడూలేని విధంగా విజయవాడను బుడమేరు ముంచెత్తిందన్నారు. బుడమేరులో ఊహించని స్థాయి వరదతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని తెలిపారు. బాధితులందరినీ ఆదుకుంటామని చెప్పారు. పాలు, ఆహారం, నీళ్లు, కొవ్వొత్తులు, టార్చ్‌లు తక్షణం తెప్పించాలని అధికారులను ఆదేశించారు. లక్ష మందికి సరిపోయే ఆహారం సరఫరా చేయాలన్నారు. తక్షణం అందుబాటులో ఉన్న ప్యాక్డ్ ఫుడ్‌ను బాధితులకు సరఫరా చేయాలని సూచించారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి అదనపు బోట్లు, ట్రాక్టర్లు తెప్పించాలని, వృద్ధులు, పిల్లలను వరద ప్రాంతాల నుంచి వెంటనే తరలించాలని ఆదేశించారు. నగరంలోని షాపుల నుంచి వాటర్ బాటిళ్లు కొనుగోలు చేయాలని, అక్షయ పాత్ర నుంచి, సరఫరా చేయగలిగిన ఏజెన్సీల నుంచి ఆహారం తెప్పించాలని సూచించారు.

కృష్ణా నదికి ఏ ఏడాది ఎంత వరద...

తేదీ నెల	సంవత్సరం	ప్రవాహం క్యూసెక్కుల్లో
7 అక్టోబరు	1903	10,60,830
11 ఆగస్టు	1914	9,48,632
2 నవంబరు	1917	9,55,460
24 సెప్టెంబరు	1939	9,24,736
2 అక్టోబరు	1964	9,87,852
6 ఆగస్టు	1966	4,12,734
30 సెప్టెంబరు	1974	5,97,800
10 జులై	1983	8,27,310
24 జులై	1989	6,86,910
17 అక్టోబరు	1998	9,32,000
21 సెప్టెంబరు	2005	7,40,232
17 ఆగస్టు	2006	5,56,618
21 సెప్టెంబరు	2007	5,56,618
11 ఆగస్టు	2008	4,22,660
5 అక్టోబరు	2009	10,94,422
6 సెప్టెంబరు	2010	2,17,340
9 సెప్టెంబరు	2011	4,28,120
4 సెప్టెంబరు	2012	1,11,500
26 అక్టోబరు	2013	4,67,040
17 సెప్టెంబరు	2014	1,14,875
22 జూన్	2015	57,500
24 సెప్టెంబరు	2016	1,39,610
21 ఆగస్టు	2018	1,62,150
17 ఆగస్టు	2019	8,05,364
14 అక్టోబరు	2020	7,76,258
6 ఆగస్టు	2021	4,44,640
16 అక్టోబరు	2022	5,06,604

పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భారీ వర్షాల నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేశామని దక్షిణ మధ్య రైల్వే ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. విజయవాడ మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే 132 రైళ్లు రద్దు చేశారు. మరో 93 రైళ్లను దారి మళ్లించారు. తాత్కాలికంగా 9 రైళ్లను రద్దు చేయగా, కొండపల్లి, రాయనపాడులో రైలు పట్టాలపై వరద ఉండటంతో ట్రాక్‌పైనే మూడు రైళ్లు నిలిచిపోయాయి. ప్రయాణికులను 40 ప్రత్యేక బస్సుల్లో విజయవాడకు తరలించారు. ఇక్కడ నుంచి ప్రత్యేక రైళ్లలో వారిని గమ్యస్థానాలకు పంపించారు.

నీటి కుంటలో పడి ముగ్గురు చిన్నారులు మృతి

ప్రజాశక్తి-పెద్దారవీడు (ప్రకాశం జిల్లా)

నీటి కుంటలో పడి ముగ్గురు చిన్నారులు మరణించిన సంఘటన ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం ఎస్.కొత్తపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు... కొత్తపల్లి గ్రామానికి చెందిన శివ (11), మను(9), ఆరవీటి ఏడుకొండలు (9) కలిసి గ్రామ సమీపంలోని ఓ నీటి కుంట వద్దకు ఆదివారం వెళ్లారు. కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు కుంటలోకి దిగారు. కాళ్లు జారిపోవడంతో ఒకరి వెంట ఒకరు కుంటలో పడిపోయారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కుంటలో నీరు అధికంగా ఉండడంతో చిన్నారులు ఒడ్డుకు చేరుకోలేక, ఊపిరాడక ముగ్గురూ మరణించారు. అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి మృతదేహాలను వెలికితీశారు.

పలు జిల్లాల్లో కుండపోత

- శ్రీశైలం ఘాట్‌రోడ్డులో విరిగిపడిన కొండ చరియలు
- పెసర్లంక అరవింద్ వారధి వద్ద కృష్ణానదికి గండి
- ఏజెన్సీలో ఉప్పొంగిన వాగులు, గెడ్డలు
- ఆంధ్ర- ఒడిశా - ఛత్తీస్‌గఢ్‌కు నిలిచిన రాకపోకలు

హనుమాన్ జంక్షన్ - ఏలూరు మధ్య జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు

ప్రజాశక్తి - యంత్రాంగం

వాయుగుండం ప్రభావంతో ఉమ్మడి కర్నూలు, ఏలూరు, విశాఖలో ఆదివారం కుండపోత వర్షం కురిసింది. పలు వాగులకు గండ్లు పడ్డాయి. లోతట్టు ప్రాంత ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 39.7 అడుగులకు చేరింది. చింతూరు వద్ద శబరి నీటిమట్టం 37.49 అడుగులకు చేరింది. కర్నూలు, నంద్యాల జిల్లాల వ్యాప్తంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎడతెరపి లేని వర్షం కురిసింది. కర్నూలు ప్రధాన రహదారులపై వర్షపు నీరు ఏరులై ప్రవహించింది. ఆదోనిలో అవుదూడ వంక, రాంజల వంక ఉధృతంగా ప్రవహించడంతో పలు కాలనీల్లోకి వరద నీరు చేరింది. చిప్పగిరి మండలంలో పంట పొలాలు నీట మునిగాయి. రుద్రవరం మండలం చిలకలూరు వాగు, నంద్యాల మండలంలో కుందూ నది, మద్దిలేరు, సంకలవాగు పొంగి పొర్లుతున్నాయి. శ్రీశైలం ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగి పడుతుండటంతో హైదరాబాద్ నుంచి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. చాగలమర్రి మండలంలో వక్కిలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

ఏలూరు జిల్లాలో వరద బీభత్సం సృష్టించింది. నూజివీడు పెద్ద చెరువుకు గండి పడడంతో నూజివీడు పరిసర ప్రాంతాలు వరద తాకిడికి గురయ్యాయి. వరద నీటిలో చిక్కుకున్న పలువురిని సురక్షిత ప్రాంతాలకు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు రక్షించాయి. రామిలేరు వరద తాకిడికి పెదపాడు మండలం అప్పన్నవీడు గ్రామంతోపాటు పలు ప్రాంతాలు నీట మునిగాయి. బొమ్ములూరు, కలపర్రు మధ్య 16 నంబరు జాయతీ రహదారిపై రామిలేరు వరద నాలుగు అడుగుల మేర ప్రవహించడంతో అధికారులు అప్రమత్తమై వాహనాల రాకపోకలను నిలిపివేశారు. దీంతో అటు కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్ నుంచి విజయవాడ వైపు ఇటు ఏలూరు జిల్లా కలపర్రు టోల్ గేటు నుంచి దెందులూరు మండలం సత్యనారాయణపురం వరకూ భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. వరద ఉధృతి తగ్గిన అనంతరం వాహనాల రాకపోకలకు అనుమతించారు. అల్లూరి జిల్లాలోని రంపచోడవరం ఏజెన్సీలో వాగులు, గెడ్డలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చింతూరు మండలంలో జాతీయ రహదారిపైకి నీరు చేరడంతో ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. విఆర్.పురంలో కాజ్‌వే పై నుంచి నీరు ప్రవహించడంతో 40 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. విలీన మండలాల్లో శబరి, గోదావరి నదుల్లో ప్రవాహ ఉధృతి పెరిగింది. ఆదివారం మధ్యాహ్నానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 39.7 అడుగులకు చేరింది. చింతూరు వద్ద శబరి నీటిమట్టం 37.49 అడుగులకు చేరింది. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. బాపట్ల జిల్లా పెసర్లంక అరవింద్ వారధి వద్ద కృష్ణానదికి గండి పడింది. కట్ట తెగిన కారణంగా కొల్లూరు మండల పరిధిలోని కష్ణా నదీపరివాహక ప్రాంతాలైన పెసర్లంక, గాజుల లంక, ఆవులవారిపాలెం, పోతర్లంక, తురకపాలెం, తిప్పలకట్ట, జువ్వలపాలెం గ్రామాలు ముంపునకు గురయ్యాయి. గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ఎగువప్రాంతంలో గుండ్లకమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది. శనివారం ఉదయం నుంచీ ఆదివారం ఉదయం వరకూ 83.7 మి.మీ.ల వర్షపాతం నమోదైంది.

నూజివీడు ట్రిపుల్ ఐటి ఫుడ్ కాంట్రాక్టరుపై చర్యలు

- ఫుడ్ కోర్టును తక్షణం మూసేయండి : లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నూజివీడు ట్రిపుల్ ఐటిలో కలుషిత ఆహారం ఘటనపై రాష్ట్రప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ ఆదివారం సమర్పించిన నివేదికలో... ట్రిపుల్ ఐటి కేటరింగ్‌లో పలు లోపాలను ఎత్తిచూపింది. వంట గదుల వద్ద పారిశుధ్యం పనులు బాగా లేకపోవడం, తాజా కూరగాయలు వాడకపోవడం, బియ్యం, ఇతర కిరాణా సరుకులలో నాణ్యత లేకపోవడం, విద్యార్థుల సంఖ్యకు తగ్గ వంట సిబ్బంది లేకపోవడం వంటి కీలకాంశాలను నివేదికలో పొందుపర్చారు. వాష్‌రూమ్‌ల నిర్వహణ కూడా సరిగ్గా లేదని నివేదికలో పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్.. ట్రిపుల్ ఐటి అధికారులతో సమావేశమయ్యారు. కేటరింగ్ అందిస్తున్న అనూష హాస్పిటాలిటీ సేవలను తక్షణమే రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. వారి టెండర్‌ను రద్దు చేయడమేగాక వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో రాష్ట్రంలో ఏ ఫుడ్ కాంట్రాక్టు టెండర్లలో పాల్గొనకుండా అనూష హాస్పిటాలిటీని బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు. ట్రిపుల్ ఐటిలో పరిస్థితులన్నీ చక్కబడే వరకు ఆర్‌డిఓ రోజూ పర్యవేక్షణ చేయాలని మంత్రి లోకేష్ ఆదేశించారు.

ప్రకాశం బ్యారేజికి పోటెత్తిన వరద

- 10.56 లక్షల క్యూసెక్కుల నీరు రాక
- రెండో ప్రమాద హెచ్చరిక జారీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

భారీ వర్షాల నేపథ్యంలో కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. ప్రకాశం బ్యారేజీకి గంటగంటకు వరద పోటెత్తడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. బ్యారేజీకి ఎగువ నుంచి 10.56 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా వచ్చిన నీరు వచ్చినట్టు సముద్రంలోకి విడుదల చేస్తున్నట్టు జలవనరుల శాఖ అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా సాగర్, పులిచింతల నుంచి విడుదల చేస్తున్న నీటితోపాటు కృష్ణా జిల్లాలోని మున్నేరు, బుడమేరు నుంచి 3.27 లక్షల క్యూసెక్కుల నీరు అదనంగా ప్రకాశం బ్యారేజీకి వచ్చి చేరుతోంది. దీంతో బ్యారేజీ 70 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతలకు ఎగువ నుంచి 6.36 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా మొత్తం 24 గేట్లు ఎత్తి 6.02 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల నుంచి వచ్చే 6.02 లక్షల క్యూసెక్కుల నీటితోపాటు ప్రకాశం బ్యారేజీ ఎగువన వాగుల ద్వారా, క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన అతిభారీ వర్షం వల్ల మరో 3.27 లక్షల క్యూసెక్కుల నీరు రావడంతో ప్రకాశం బ్యారేజీకి ఆదివారం 10.56 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చింది. దీంతో ప్రకాశం బ్యారేజీ పరిసర ప్రాంతాలన్నీ ముంపునకు గురవుతున్నాయి. సోమవారం నాటికి ప్రకాశం బ్యారేజీకి 11 లక్షల క్యూసెక్కులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎన్‌టిఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని వివిధ మండలాల పరిధిలో 50 గ్రామాలు ముంపు బారినపడ్డాయి. మరోవైపు ఎగువ నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు 5.30 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా 5 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో నాగార్జున సాగర్ జలాశయానికి వరద పోటెత్తింది. సాగర్‌కు 4.83 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్టు డ్యామ్‌కు ఉన్న 26 గేట్ల ద్వారా 5.16 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- కేంద్రానికి లేఖ రాస్తాం : సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నెలకొన్న వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా కేంద్ర ప్రభుత్వానికి సోమవారం లేఖ రాస్తామని ప్రజాశక్తి ప్రతినిధి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న వరదల నేపథ్యంలో తాడేపల్లిలోని విపత్తు నిర్వహణ కార్యాలయంలో అధికారులతో కలిసి ఆదివారం తొలుత సమీక్ష నిర్వహించారు. అనంతరం విజయవాడలోని సింగ్‌నగర్ ప్రాంతంలో నీటమునిగిన ప్రాంతాల్లో ముఖ్యమంత్రి పర్యటించారు. అనంతరం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరు కార్యాలయం, అంతకుముందు విపత్తు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని పరిస్థితిపై కేంద్ర హోంశాఖ మంత్రితో మాట్లాడానని చెప్పారు. 10 ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, 40 పవర్ బోట్లు, 10 హెలికాప్టర్లు రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని హెలికాప్టర్ ద్వారా తీసుకొస్తామన్నారు. రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా వరదలు సంభవించాయని చెప్పారు. అకాల వర్షాలు, పై నుంచి వస్తున్న వరద నీరు వల్ల ఈ పరిస్థితి వచ్చిందన్నారు. 1998లో ఈ తరహా వరద వచ్చిందన్నారు. ఆ సమయంలో 9.24 లక్షల క్యూసెక్కులు వస్తే, ఇప్పుడు 9.70 లక్షల క్యూసెక్కులు వచ్చాయని వివరించారు. ఈ విపత్తును సమర్ధవంతంగా ఎదుర్కొంటున్నామని చెప్పారు. బుడమేరు వాగు తెగడంతో 16 డివిజన్లు నీట మునిగాయని చెప్పారు. నీటిలో చిక్కుకున్న వారి కోసం ఆహారం తయారు చేయాలని అక్షయపాత్ర, హోటల్ యాజమాన్యాలను సంప్రదించామని తెలిపారు. విజయవాడలోని అన్ని కళ్యాణ మండపాలు, హోటళ్లు అందుబాటులో పెట్టామని, అవసరమైతే ఇంకా ఏర్పాటు చేస్తామన్నారు. సింగ్‌నగర్‌లో పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రతి డివిజన్‌కు ఒక సీనియర్, సచివాలయానికి జూనియర్ ఐఎఎస్ అధికారులను నియమిస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలో 2,76,145 మంది ప్రజలు ఉన్నారని తెలిపారు. బాధితుల సహాయం కోసం కమాండ్ కంట్రోల్ నెంబర్లు 112, 107 ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి విపత్తులు రాకుండా చర్యలు చేపడతామని ప్రకటించారు. నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే వరకు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరు కార్యాలయంలో ఉండి అవసరమైన చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. ఈ సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, డిజిపి ద్వారకా తిరుమలరావు, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరు సృజన పాల్గొన్నారు. ఆదివారం రాత్రి 11 గంటల తరువాత చంద్రబాబు మరోసారి సింగ్‌నగర్ ప్రాంతంలో పర్యటించారు.

ముఖ్యమంత్రికి ప్రధాని మోడీ ఫోన్

రాష్ట్రంలో వరద పరిస్థితులపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆదివారం రాత్రి ఫోన్ చేశారు. పరిస్థితులను ముఖ్యమంత్రిని అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ పరంగా అన్ని సహాయ, సహకారాలు అందిస్తామని మోడీ చెప్పారు. రాష్ట్రానికి అవసరమైన సహాయం చేయాలని ఆయా శాఖలకు ఆదేశాలు ఇచ్చామని వివరించారు.

కృష్ణాకు 11 లక్షల క్యూసెక్కుల వరద వచ్చే అవకాశం

- రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎగువన కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో కృష్ణా నదిలో 9.25 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వుందని, ఈ ప్రవాహం 10.5 నుండి 11 లక్షల క్యూసెక్కులకు పెరిగే ప్రమాదం వుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ తెలిపారు. పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా వుండాలని సూచించారు. ఈ మేరకు ఆయన ఆదివారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. కృష్ణా నది వరద ప్రవాహం ఉధృతంగా వున్నందున ఎన్‌టిఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 9.25 లక్షల క్యూసెక్కులుగా ఉందన్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుందని, 10.5 లక్షల నుంచి 11 లక్షల క్యూసెక్కులు వరకు వరద చేరే అవకాశం ఉందని అన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఎకరాకు రూ.20 వేలు నష్ట పరిహారం చెల్లించాలి
- ఎపి రైతు, కౌలురైతు సంఘాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు వరి, పత్తి, మొక్కజొన్న, మిర్చి, వేరుశనగ, కంది వంటి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, తక్షణమే ప్రభుత్వం నష్టపోయిన రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం, ఎపి కౌలురైతు సంఘం డిమాండ్ చేశాయి. ఎకరాకు రూ.20 వేల నష్టపరిహారం ఇవ్వాలన్నాయి. ఈ మేరకు ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి, ఎపి కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు ఆదివారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. వర్షాలు, వరదలతో ఉమ్మడి గుంటూరు, కృష్ణా, కర్నూలు, ఏలూరు జిల్లాల్లో పంటనష్టం ఎక్కువగా జరిగిందన్నారు. పోలవరం, బుడమేరు కాల్వలకు గండ్లు పడి చాలాచోట్ల తెగిపోయాయన్నారు. ఈ తీవ్ర ముప్పు నుండి ప్రజలను రైతులు, కౌలురైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. ఇప్పటికీ రాష్ట్రంలో ఇ-క్రాప్ నమోదు పూర్తిగా కానందున ఇ-క్రాప్‌తో సంబంధం లేకుండా పంట నష్టం అంచనాలను తయారు చేయాలన్నారు. నీటి మునిగిన వాణిజ్య, ఆహార పంటల దిగుబడులు బాగా తగ్గిపోయే పరిస్థితి వున్నందున నీటి మునిగిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. తక్షణమే డ్రెయినేజీల్లో ఉన్న అడ్డంకులను తొలగించి నీరు బయటకు పంపే చర్యలు తీసుకోవాలన్నారు. పంట నష్టానికి రూ.10 వేల నుండి రూ.20 వేల వరకు నష్టపరిహారాన్ని వాస్తవ సాగుదారులకే ఇవ్వాలన్నారు. అలాగే ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు, నష్టపరిహారాలు కూడా వాస్తవ సాగుదారులైన కౌలురైతులకే ఇవ్వాలని కోరారు.

సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం : వైసిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే వారికి అండగా వరద సహాయక చర్యలు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆదివారం వైసిపి నాయకులు మల్లాది విష్ణు, దేవినేని అవినాష్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. బాధితులకు ప్రభుత్వం కనీస అవసరాలు తీర్చడం లేదన్నారు. విజయవాడలో కొండ చరియలు విరిగిపడి పలువురు చనిపోతే ఏమీ పట్టనట్లు రాష్ట్రప్రభుత్వం వ్యవహరించడం తగదన్నారు.

నీట మునిగిన లంకలు

- భయం గుప్పిట్లో రాజధాని గ్రామాలు
- పడవల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కృష్ణానదికి భారీగా వరద ప్రవాహం రావడంతో గుంటూరు, పల్నాడు జిల్లాలోని పలు లంక గ్రామాలు నీట మునిగాయి. లంక గ్రామాల ప్రజలు భయం గుప్పిట్లో చిక్కుకున్నారు. గ్రామాల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. అమరావతి మండలంలో వైకుంఠపురం, అమరావతి, గిడుగు, పొందుగల, మునుగోడు, ధరణికోట లంక గ్రామాలలో తమ గొర్రెలను మేపుటకు వెళ్లి వరదలో చిక్కుకున్న 36 మందిని 1500 గొర్రెలను అధికారులు కాపాడారు. అచ్చంపేట మండల పరిధిలోని కొనూరు, కస్తాల, చామర్రు లంక గ్రామాలలో చిక్కుకొన్న 14 మందిని, 2001 గొర్రెలను వెరసి మొత్తం 50 మందిని 3501 గొర్రెలను యుద్ధ ప్రాతిపదికన జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు చొరవతో 14 బోట్ల ద్వారా సురక్షిత ప్రాంతానికి తరలించారు. పలు లంక గ్రామాలను కలెక్టరు అరుణ్‌బాబు, ఎస్‌పి శ్రీనివాసరావు సందర్శించి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రక్రియను పరిశీలించారు. దాచేపల్లి మండలం రామాపురం మత్స్యకారుల కాలనీని వరద నీరు చుట్టుముట్టింది. 50 కుటుంబాలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. పడవలలో గ్రామస్తులను పునరావాస కేంద్రాలకు తీసుకువెళ్లారు. గుంటూరు జిల్లా తుళ్లూరు, కొల్లిపర, తాడేపల్లి మండలాలకు చెందిన పలు లంక గ్రామాల ప్రజలను, తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం, ఉద్దండ్రాయునిపాలెం, రాయపూడి పరిసర ప్రాంత వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తాడికొండ అడ్డరోడ్డు లాం దగ్గర కొండవీటి వాగు పొంగిన చప్టా వద్ద కుంభ రవి అనే విద్యార్థి కొట్టుకుని పోయి ఓ చెట్టును పట్టుకుని ఉండడంతో స్థానికులు, అధికారులు ఒడ్డుకు చేర్చారు. రాయపూడి పెదలంక వాసులను ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంకు తరలించారు.

పది మంది మరణించడం బాధాకరం

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో పది మంది మరణించడం బాధాకరమని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలవాలని జనసేన పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అధికార యంత్రాంగం చేపట్టే సహాయక చర్యలతోపాటు నాయకులు, శ్రేణులు కూడా సహాయం చేయడం అవసరమన్నారు. ఆహారం, రక్షిత నీరు అందించాలని, అదే విధంగా పిల్లలకు పాలు, బ్రెడ్, బిస్కెట్స్ వంటివి అందుబాటులో ఉంచాలని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని అన్నారు. అందరూ సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

ముంపు శాశ్వత పరిష్కారానికి మాస్టర్ ప్లాన్

- మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలో ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామని, అండర్ గ్రౌండ్, స్ట్రోమ్ వాటర్ డ్రెయినేజీ సిస్టమ్ అంతర్భాగాలుగా ఉంటాయని రాష్ట్ర విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. భారీ వర్షాల కారణంగా మంగళగిరి నియోజకవర్గంలో ముంపునకు గురైన తాడేపల్లి, నులకపేట క్వారి ఏరియా, మంగళగిరి రత్నాల చెరువు, దీన్ దయాళ్ నగర్, టిడ్కో కాలనీ ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. మంగళగిరి కొత్తపేటలో కొండచరియలు విరిగిపడి దెబ్బతిన్న ఇంటిని పరిశీలించారు. కొండచరియలు విరిగిపడి మృతి చెందిన నాగరత్నమ్మ భౌతికకాయానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రభుత్వం తరపున రూ.5 లక్షల పరిహారం అందజేశారు. రత్నాల చెరువులో చేనేత కార్మికుని ఇంటికి వెళ్లి మగ్గం గుంటల్లో చేరిన నీటిని పరిశీలించారు. వరద కారణంగా ఇళ్ల మధ్య చేరిన నీటిని మోటార్ల ద్వారా తొలగించాలని, పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... వచ్చే వారంరోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గుంటూరు చానల్ 0-14 కిలో మీటర్ల పరిధిలో 8 చోట్ల గండ్లు పడ్డాయని, యుద్ధప్రాతిపదికన ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని తెలిపారు.

మంగళగిరిలో కొండచరియ విరిగిపడి మృతి చెందిన నాగరత్నమ్మ కుటుంబ సభ్యులకు పరిహారం అందజేస్తున్న లోకేష్

గుడ్లవల్లేరు కాలేజీలో హిడెన్ కెమెరాలు బ్లూమీడియా సృష్టే

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల బాత్రూమ్‌లలో హిడెన్ కెమెరాలు బ్లూమీడియా సృష్టి మాత్రమేనని, అక్కడ కెమెరాలు ఉన్నట్లు ఎటువంటి ఆధారాలు లభించలేదని నారా లోకేష్ పేర్కొన్నారు. వైసిపి నేతల సినీనటి వేధింపుల కేసు, మద్యం కుంభకోణం, భూ అక్రమాలు వరుసగా బయల్పడుతుండడంతో వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే హిడెన్ కెమెరాల నాటకానికి తెరలేపారని ధ్వజమెత్తారు. గుడ్లవల్లేరులో నలుగురు విద్యార్థుల మధ్య జరిగిన ఒక వ్యక్తిగత అంశం ఈ గొడవకు కారణమైందని, సంబంధిత విద్యార్థిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నూజివీడు ట్రిపుల్ ఐటిలో ఆహారం కలుషితమైందని తెలిసిన వెంటనే డైరక్టర్‌ను విధుల నుంచి తొలగించామని, ముగ్గురు ఉన్నతాధికారులతో పర్యవేక్షక కమిటీని నియమించామని తెలిపారు.

శ్రీశైలానికి వరద ఉధృతి

- పది గేట్లు ఎత్తివేత

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతం నుంచి వరద ఉధృతి పెరుగుతుంది. ఎగువ జూరాల నుంచి 3,87,919 క్యూసెక్కులు, తుంగభద్ర ద్వారా 4,478 క్యూసెక్కులతో కలిపి మొత్తం 3,92,397 క్యూసెక్కులు శ్రీశైలానికి వచ్చి చేరుతున్నాయి. దీంతో పది గేట్ల ద్వారా 4,06,242 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అదే సమయానికి జలాశయ నీటి మట్టం 885 అడుగులకు గాను ప్రస్తుతం 884.90 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 215 టిఎంసిలకు గాను 214.363 టిఎంసిలు నమోదైంది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 26,042 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1400 క్యూసెక్కులు, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 1700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.నాగార్జున సాగర్‌కు 5,03,447 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

గౌరవనీయమైన నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్
హైదరాబాద్ బెంచ్-II, హైదరాబాద్ వారి సమక్షంలో
ఐఏ నెం.1310 ఆఫ్ 2024
IN
సిపి (ఐబి) నెం.320/7/హెచ్‌డిబి/2022
మంజీర కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ విషయంలో

వీరి మధ్య: మంజీర కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్
ప్రతినిధియైనచ దీని రిజల్యూషన్ ప్రొఫెషనల్ ...పిటిషనర్
మరియు
శ్రీమతి కొత్తపల్లి కృష్ణ కుమారి & 23 ఇతరులు. ...ప్రతివాదులు

దయచేసి గమనించండి:
1) వకా వెంకటేశ్వరరావు (ప్రతివాది నెం.6)
2) పాండి రామకృష్ణ రావు (ప్రతివాది నెం.7)
3) శ్రీ.సనగల కోటి రెడ్డి (ప్రతివాది నెం.18)

ఏదైతే ఎన్‌సిఎల్‌టి రూల్స్, 2016లోని రూల్ 11తో చదవబడు ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్, 2016లోని సెక్షన్ 66 మరియు 67 ప్రకారం హైదరాబాద్‌లోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్-2 సమక్షంలో కంపెనీ పిటిషన్ 320/7/హెచ్‌డిబి/2022లో ఐ.ఏ.నెం.1310 ఆఫ్ 2024 కలిగిన ఇంటర్‌లోక్యూటరీ దరఖాస్తును పిటిషనర్ దాఖలు చేశారు, దీనిలో మీరు ప్రతివాది నెం.6, 7 మరియు 18గా వర్గీకరించబడ్డారు.

మీరు ఇందుమూలంగా అధీకృత సిబ్బంది ద్వారా లేదా పిటిషనర్ ప్రార్థించిన ఉపశమనం ఎందుకు మంజూరు చేయకూడదో అనే దానిపై తగిన విధంగా సూచించబడిన ప్లీడర్/ అడ్వకేట్ ద్వారా కార్పొరేట్ భవన్ ఆర్‌ఓసి హైదరాబాద్, గ్రౌండ్ ఫ్లోర్, బండ్లగూడ, నాగోల్, తిరుమల రెసిడెన్సీ కాలనీ, ఆర్ కృష్ణయ్య నగర్, హైదరాబాద్, తెలంగాణ-500068, చిరునామా లోగల సదరు గౌరవనీయమైన నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్-2, హైదరాబాద్ వారి సమక్షంలో మీరు 19.09.2024న వర్చువల్‌గా/ భౌతికంగా హాజరై కారణం చూపవలసి ఉంటుంది. హాజరుకాని పక్షంలో ఈ దరఖాస్తును విచారించి మరియు మీరు పరోక్షంగా తీర్మానించబడునని గమనించండి.

సం/- మెయిల్ ఐడి: cirp.mcl@gmail.com,
సంప్రదించె నెం: 8286241561, (మంజీర కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్)

నష్టపోయిన వారిని ఆదుకోండి

ముంపు ప్రాంతాలను పరిశీలించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అన్ని రకాల పంటలు దెబ్బతినడమే కాకుండా, పేదలు నివసిస్తున్న కాలనీలు నీట మునిగిపోయాయని, పేదలు ఉపాధి కోల్పోయారని, ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతులను, పేదలను ఆదుకోవాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం పెదకాకాని, గొళ్ళపూడి, నంబూరు, మంగళగిరి మండలంలోని కాజ గ్రామాల్లో సిపిఎం బృందం పర్యటించింది. పొలాలను, నీటమునిగిన నివాస ప్రాంతాలను పరిశీలించింది. ఈ సందర్భంగా రైతులు, స్థానిక ప్రజలు పలు సమస్యలను ఈ బృందం దృష్టి తెచ్చారు. ఇప్పటికే ఎకరానికి వరి పంటకు రూ.30 వేలు ఖర్చు చేశారని, అధిక వర్షాలకు పంట కాల్వలు, చెరువులు తెగిపోయి నీరంతా పొలాలపై ప్రవహిస్తుందని, పొలాలన్నీ చెరువులను తలపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరి పంట పూర్తిగా మునిగిందని తెలిపారు.

మరో రెండు రోజులు ఇదే పరిస్థితి ఉంటే పంట పూర్తిగా నష్టపోయే ప్రమాదముందన్నారు. నీళ్లు ఇళ్లల్లోకి వచ్చి ఇంట్లోని వస్తువులన్నీ మునిగిపోయాయని, వంట సరుకులు పూర్తిగా తడిచిపోయాయని తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం బాధితులను ఆదుకోవాలని, 50 కిలోల బియ్యం, నూనె, చింతపండు వంటి సరుకులను తక్షణమే అందించి సహాయం చేయాలని అధికారులను కోరారు. వ్యవసాయ శాఖ వెంటనే పంట నష్టాన్ని అంచనా వేయాలన్నారు. సహాయ శిబిరాలలో ఉన్న వారికి సరైన వసతులు కల్పించాలని కోరారు. అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లించాలని, మంచి నీటిని క్లోరినేషన్ చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి, ఈమని అప్పారావు, పార్టీ నాయకులు నన్నపనేని శివాజి, బి.కొటేశ్వరి, సత్యమారెడ్డి, గోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని మండలంలో గొల్లమూడిలో నీటమునిగిన పొలాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

Chola
Enter a better life

చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీసు చిరునామా: చోల క్రెస్ట్, సూపర్ బి, సి54& సి55,4, తిరు విక ఇండస్ట్రీయల్ ఎస్టేట్, గ్యూండి, చెన్నై-600 032.

[(అనుబంధం IV) (రూల్ 8(1) క్రింద] స్వాధీనత నోటీసు

ఏదైతే దిగువసంతకందారు అయిన మెస్సర్స్ చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారి, సెక్యూరిటీజైషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద అధికారాలు అధ్యాయనం చేస్తూ, సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోపల తదుపరి వడ్డీ మరియు సదరు నోటీసులో పేర్కొన్న మొత్తం తిరిగిచెల్లించుటకు రుణగ్రహీతలు (పేరులు మరియు చిరునామా దిగువ పేర్కొనబడినాయి) పిలుస్తూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద దిగువ పేర్కొన్న తేదిన డిమాండ్ నోటీసు జారీచేయబడింది. రుణగ్రహీతలు మొత్తాన్ని తిరిగిచెల్లించుటలో విఫలమైనందున, ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువుతూ చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి అందించిన అధికారాలు అధ్యాయనం చేస్తూ ఇక్కడ దిగువ వివరించిన ఆస్తిని దిగువసంతకందారుడు స్వాధీనపరుచుకోవడమైంది. ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారు ఇక్కడ క్రింద పేర్కొన్న మొత్తం మరియు దానిపిమ్మట వడ్డీ మెస్సర్స్. చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క చార్జ్‌కు లోబడి జరుపవచ్చును. రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది.

క్ర. సం	రుణగ్రహీతల పేరు మరియు చిరునామా మరియు రుణ ఖాతా నెంబర్	డిమాండ్ నోటీసు తేది	బకాయి మొత్తం	స్వాధీనతా ఆస్తి వివరణ	స్వాధీనతా తేది
1.	రుణ ఖాతా నెం(లు): HL02VJI000033398 జుజ్జువరపు యువరాజు, జుజ్జువరపు ఇజెర, కుందేటి ప్రత్యుష, జయనాథరావు జుజ్జువరపు, అందరి నివాసం: డో.నం.7-78, కాటూరు, ఉయ్యూరు, గాంధిబొమ్మ సెంటర్, ఉయ్యూరు-521164 ఇక్కడ కూడా : డో.నం.20-64-3, పామర్రు కృష్ణ ఎన్‌టిఆర్ విగ్రహం పామర్రు-521157	17-06-2024	11.06.2024 నాటికి రూ.30,97,739/- (ముప్పై లక్షల తొంభై ఏడు వేల ఏడు వందల ముప్పై తొమ్మిది రూపాయలు మాత్రమే) మరియు దానిపై వడ్డీ.	కృష్ణాజిల్లా, పామర్రు ఎస్‌ఆర్‌ఓ, పామర్రు మండలం, పామర్రు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, పామర్రు గ్రామం, ఆర్.ఎస్.నం.59 8, డో.నం.20-64-3 వద్ద, ప్లాట్ నం.24 ఈ ఆస్తి మొత్తం విస్తీర్ణం 143.8 చ.గ.లు. తో అన్నీ సౌలభ్య హక్కులు. ఉన్న హద్దులు : తూర్పు : ఓరుగంటి శ్రవంతి ప్లాట్ నం.13 ఆస్తి 8.06 మీ.లు., దక్షిణం : పంటబోడి 14.94 మీ.లు., పడమర : 12 మీ.లు. వెడల్పు రోడ్డు 8.00 మీ.లు., ఉత్తరం : ప్లాట్ నం.23 ఆస్తి 15.01 మీ.లు.	స్వాధీనత తేది : 28-ఆగస్టు-2024

తేది: 28.08.2024
ప్రదేశం: కృష్ణ

చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్., తరపున
అధీకృత అధికారి

మంచిరోజులొస్తాయి.. భయపడొద్దు

మాజీ సిఎం వైఎస్ జగన్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ (కడప)

మంచి రోజులొస్తాయి.. ఎవరూ భయపడొద్దు.. కష్టాలను ధైర్యంగా ఎదుర్కొందామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కడప జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు ఆదివారం పట్టణంలోని తన కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలతో జగన్ మాట్లాడుతూ.. మళ్లీ ప్రజల్లోకి వస్తానని, భవిష్యత్ మనదే అని ధైర్యం చెప్పారు. అందరం కలిసి కట్టుగా ముందుకెళ్లాల్సిన అవసరముందని పేర్కొన్నారు. నిరంతరం ప్రజాశ్రేయస్సుకు అనుగుణంగా అడుగులు వేయాలని పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు. కొంతమంది కార్యకర్తలు వారి ఆరోగ్య, నిరుద్యోగ సమస్యలను వైఎస్.జగన్ దష్టికి తీసుకొచ్చారు. ఆయన స్పందిస్తూ వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపి అవినాష్ రెడ్డికి సూచించారు. పట్టణంలోని క్రీడాకారులు వారి సమస్యలను ఆయనకు వివరించడంతో క్రీడల్లో బాగా రాణించి పులివెందులకు, మన రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న వై.ఎస్. జగన్

జిల్లా రాజకీయాలపై ఆరా..

వైసిపి ముఖ్య నాయకులతో జిల్లా రాజకీయాలపై ఆరా తీశారు. జిల్లా పరిషత్ చైర్మన్ పదవీ చేజారకుండా ఉండేందుకు ముఖ్య నేతలకు దిశానిర్దేశం చేశారు. ఎవరైనా జడ్‌పిటిసి సభ్యులు అసంతప్తిగా ఉంటే తమ దగ్గరికి తీసుకురావాలని, జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక జరిగేంతవరకు వారిపై ప్రత్యేక దష్టి పెట్టాలని నాయకులకు సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని నాయకులతో అన్నట్లు సమాచారం.

వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకించండి : ఆవాజ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకించాలని, ముస్లిములపై దాడులను అడ్డుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. వక్ఫ్‌చట్ట సవరణను వ్యతిరేకిస్తూ కర్నూలు పాతబస్తి ఉర్దూఘర్ షాదిఖానాలో ఆవాజ్ ఆధ్వర్యంలో వివిధ ప్రజా సంఘాల నాయకులతో ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు షేక్.అబ్దుల్ సుభాన్ మాట్లాడుతూ.. రాజేందర్ సచార్ కమిటీ సిఫారసుల మేరకు దేశంలో ముస్లిం మైనారిటీలు చాలా వెనకబాటుకు గురవుతున్నారని పేర్కొందన్నారు. వారి అభివృద్ధి కోసం వక్ఫ్ ఆస్తులు ఉపయోగించి వారికి సహకరించాలని సూచనలు చేసిందన్నారు. రంగనాథ్ మిశ్రా కమిషన్, పుట్టుస్వామి కమిషన్, రాజేంద్ర సచార్ కమిటీలు ఎన్నో రకాల సూచనలు చేసినప్పటికీ ప్రభుత్వాలు వివక్షపూరితంగా మైనార్టీల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మైనారిటీ వింగ్ ఖాజా హుస్సేన్, మహమ్మద్ పీర్, మూమెంట్ ఫర్ పీస్ జస్టిస్ రాష్ట్ర నాయకులు ఖదీర్‌బాష, ముస్లిం ఐక్యవేదిక నాయకులు జాకీర్ హుస్సేన్, జమాతే ఇస్లాం ఏ హింద్ నాయకులు , వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా, ఎంఐవి నాయకులు షేక్ నజీరుద్దీన్, సయ్యద్ నూరుల్లా ఖాద్రి, ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనార్టీ ప్రెసిడెంట్ మాలిక్ బాష ,ఎంహెచ్‌పిఎస్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ యూనుస్ ఇతర ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. అన్ని ప్రజా సంఘాలు ఐక్యమై పెద్ద ఎత్తున పోరాటాలు ,ఆందోళనలు చేపట్టి బిజెపికి బుద్ధిచెప్పాలని కోరారు.

పంట నష్టం అంచనాలు తయారు చేయండి

- కాల్ సెంటర్ల ద్వారా సూచనలు
- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో ఏర్పడిన పంట నష్టాన్ని త్వరితగతిన అంచనా వేయాలని, పంటనష్టం అదుపు చేసేందుకు ప్రత్యేక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖల అధికారులతో ఆదివారం అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రెయినేజీ కాలువలు క్లియర్ చేసి నీటి నిల్వలు మళ్లించాలని, వరద కారణంగా చనిపోయిన పశుసంపద నష్టం అంచనా వేయాలని అధికారులకు సూచించారు. పశువులు మృత్యువాత పడకుండా అవసరం మేరకు అధికారులు, సిబ్బంది, మందులతో వరద ప్రాంతాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ, మత్స్యశాఖల కాల్ సెంటర్లు ద్వారా ఎప్పటికప్పుడు రైతులకు, మత్స్యకారులకు సూచనలివ్వాలన్నారు. పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది సెలవులు పెట్టకుండా, రైతులకు అండగా నిలవాలన్నారు. ముంపునకు గురైన పంటల పునరుద్ధరణకు సలహాలు ఇవ్వాలన్నారు. రైతుసేవా కేంద్రాలు, మండల, జిల్లా స్థాయి అధికారులు పంట క్షేత్రాలను పరిశీలించాలని చెప్పారు. ముంపు ప్రాంతాల్లో అత్యవసర సేవల్లో అవసరం మేరకు ఇతర శాఖలకు వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది సహాయ, సహకారాలు అందించాలన్నారు.

రైతులకు పూర్తి స్థాయిలో భరోసా : బుడితి రాజశేఖర్

పంటలను కాపాడుకునేందుకు సంబంధించి రైతులకు భరోసా కల్పించేందుకు అవసరమైన చర్యలను వ్యవసాయశాఖ అధికారులు చేపట్టాలని వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్, సంచాలకులు ఎస్ ఢిల్లీరావు పేర్కొన్నారు. ఎన్‌టిఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఏలూరు జిల్లాల వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ముంపునకు గురైన పొలాలను గుర్తించడం, డ్రెయిన్ల నుంచి నీరు బయటకు వెళ్లని ప్రాంతాలకు, నీటి పారుదల అధికారులను సంప్రదిస్తూ ముంపు ప్రాంతాల పంటల నుంచి నీళ్లను బయటకు వెళ్లగొట్టే ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు.

LAURUS Labs
Chemistry for Better Living

లారస్ ల్యాబ్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: లారస్ ఎన్‌క్లేవ్, ప్లాట్ ఆఫీస్ 01, ఇ. బోనంగి గ్రామం, పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా - 531 021, ఆంధ్రప్రదేశ్.
కార్పొరేట్ ఆఫీస్: 2వ అంతస్తు, సెరీన్ ఛాంబర్స్, రోడ్ నెం. 7, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034, తెలంగాణ.
ఫోన్: +91 40 3980 4333; **ఈ-మెయిల్:** secretarial@lauruslabs.com; **వెబ్‌సైట్:** www.lauruslabs.com
కార్పొరేట్ గుర్తింపు సంఖ్య : L24239AP2005PLC047518

ప్రకటన

ఇందుమూలంగా సభ్యులకు తెలియజేయునది ఏమనగా కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా జారీచేసిన జనరల్ సర్క్యులర్ నెం.20/2020 తేది: 05.05.2020, జనరల్ సర్క్యులర్ నెం.02/2022 తేది: 05.05.2022, జనరల్ సర్క్యులర్ నెం.10/2022 తేదీ.28.12.2022 మరియు జనరల్ సర్క్యులర్ నెం.09/2023 తేది: 25.09.2023 ("ఎంసిఏ సర్క్యులర్లు"), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా ద్వారా జారీచేసిన జనరల్ మీటింగ్‌లపై సెక్రటేరియల్ స్టాండర్డ్-2 ("ఎస్ఎస్-2"), కంపెనీస్ (మేనేజ్‌మెంట్ అండ్ అడ్మినిస్ట్రేషన్) రూల్స్, 2014 తో చదవబడు కంపెనీల చట్టం, 2013 (ది 'చట్టం')లోని సెక్షన్ 10ను అనుసరించి, రిమోట్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ (ఈ-ఓటింగ్) ద్వారా తేది: 28 ఆగష్టు, 2024 నాటి పోస్టల్ బ్యాలెట్ నోటీసులో పేర్కొన్నట్లుగా కంపెనీ యొక్క నాన్-ఎగ్జిక్యూటివ్ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా శ్రీ. రమేష్ సుబ్రమణియన్ (డిఐఎన్: 02933019) నియామకం కోసం కంపెనీ సభ్యుల ఆమోదాన్ని కోరడమైనది.

పైన పేర్కొన్న ఎంసిఏ సర్క్యులర్‌లకు అనుగుణంగా, కంపెనీ / డిపాజిటరీ పార్టిసిపెంట్‌తో ఇమెయిల్ అడ్రస్‌లను నమోదు చేయబడిన అట్టి సభ్యులకు ఎలక్ట్రానిక్ విధానం ద్వారా మాత్రమే 23 ఆగష్టు, 2024 నాటికి సభ్యుల రిజిస్టర్ / బెనిఫిషియల్ ఓనర్స్ జాబితాలో పేర్లు ఉన్న సభ్యులందరికీ 31 ఆగష్టు, 2024న పోస్టల్ బ్యాలెట్ నోటీసును కంపెనీ పంపింది. డిపాజిటరీలలో ఇ-మెయిల్ ఐడిలు నమోదు చేసుకోని సభ్యులు పోస్టల్ బ్యాలెట్ నోటీసులో వివరించిన విధంగా అవసరమైన వివరాలు మరియు పత్రాలను మా రిజిస్ట్రార్ & షేర్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ ('ఆర్‌టిఏ') అనగా కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్‌కి పంపవలసిందిగా అభ్యర్థించబడింది.

పైన పేర్కొన్న సర్క్యులర్‌ల కారణంగా, పోస్టల్ బ్యాలెట్ నోటీసు యొక్క కాగితపు కాపీ, ఫారాలు మరియు ప్రీ-పెయిడ్ బిజినెస్ ఎన్వలప్ ఈ పోస్టల్ బ్యాలెట్ కోసం పంపబడవు. రిమోట్ ఇ-ఓటింగ్ సౌకర్యం ద్వారా మాత్రమే ఓటింగ్ చేయవచ్చు. రిమోట్ ఇ-ఓటింగ్ ప్రక్రియను సులభతరం చేయడానికి నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ ("ఎన్ఎస్‌డిఎల్") సేవలను కంపెనీ ఉపయోగిస్తున్నది.. రిమోట్ ఇ-ఓటింగ్ వ్యవధి బుధవారం, 04 సెప్టెంబర్, 2024న ఉ. 9:00 గంటలకు ప్రారంభమవుతుంది మరియు గురువారం, 03 అక్టోబర్, 2024 సా.05:00 గంటలకు ముగుస్తుంది. పేర్కొన్న తేదీ మరియు సమయం తర్వాత రిమోట్ ఇ-ఓటింగ్ అనుమతించబడదు మరియు ఆ తర్వాత ఓటింగ్ కోసం ఇ-ఓటింగ్ మాడ్యూల్ ఎన్ఎస్‌డిఎల్ ద్వారా నిలిపివేయబడుతుంది. సభ్యులు తమ ఓటును ఎలక్ట్రానిక్ పద్ధతిలో వేయడానికి ఈ పోస్టల్ బ్యాలెట్ నోటీసులోని 'నోట్స్'లోని సూచనలను చదవవలసిందిగా అభ్యరించడమైనది.

30 ఆగష్టు, 2024 ("కటాఫ్ తేది") డిపాజిటరీల ద్వారా నిర్వహించబడుతున్న సభ్యుల రిజిస్టర్‌లో లేదా బెనిఫిషియల్ రిజిస్టర్‌లో పేరు నమోదు చేయబడిన వ్యక్తి మాత్రమే రిమోట్ ఇ-ఓటింగ్ సదుపాయాన్ని పొందేందుకు అర్హులు. కటాఫ్ తేది నాటికి సభ్యుడు కాని వ్యక్తికి సమాచార నిమిత్తం కోసం మాత్రమే ఈ నోటీసును పరిగణించాలి. సభ్యుల ఓటింగ్ హక్కులు కటాఫ్ తేదీ నాటికి కంపెనీ యొక్క చెల్లించిన ఈక్విటీ షేర్ క్యాపిటల్‌లో వారి షేర్లకు నిష్పత్తిలో ఉంటుంది.

ఇ-ఓటింగ్ సౌకర్యం వెబ్-లింక్: www.evoting.nsdl.comలో అందుబాటులో ఉంది. రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా ఓటువేసే ప్రక్రియ మరియు పద్ధతిని సూచించే వివరణాత్మక స్టేట్‌మెంట్‌తో పాటు పోస్టల్ బ్యాలెట్ నోటీసు కంపెనీ వెబ్‌సైట్: www.lauruslabs.comలో, స్టాక్ ఎక్స్ఛేంజీల వెబ్‌సైట్: www.bseindia.com మరియు www.nseindia.com నందు మరియు ఎన్ఎస్‌డిఎల్ వెబ్‌సైట్: www.evoting.nsdl.com లో అందుబాటులో ఉంది.

న్యాయమైన మరియు పారదర్శకంగా పోస్టల్ బ్యాలెట్‌ను పరిశీలించడానికి స్క్రూటినైజర్‌గా మెసర్స్ ఆర్‌పిఆర్ & అసోసియేట్స్ (మెంబర్‌షిప్ నెం.ఎఫ్‌సిఎస్ 5783) (సిపి నెం.5360), ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీలు నియమించబడ్డారు.

కంపెనీ షేర్లు జాబితా చేయబడిన స్టాక్ ఎక్స్ఛేంజీలలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ముగిసిన తేదీ నుండి 2 పని రోజులలో స్క్రూటినైజర్ నివేదికతో పాటు పోస్టల్ బ్యాలెట్ ఫలితాలు ప్రకటించబడతాయి. ఫలితాలను ప్రకటించిన వెంటనే కంపెనీ వెబ్‌సైట్ అనగా www.lauruslabs.com మరియు ఎన్ఎస్‌డిఎల్ వెబ్‌సైట్ అనగా www.evoting.nsdl.com లో కూడా ఫలితాలు ఉంచబడతాయి.

డిపాజిటరీ అనగా ఎన్ఎస్‌డిఎల్ మరియు సిడిఎస్ఎల్ ద్వారా లాగిన్‌కు సంబంధించిన ఏదేని సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం వాటాదారుల కోసం హెల్ప్‌డెస్క్ వివరాలు:

లాగిన్ రకం	హెల్ప్‌డెస్క్ వివరాలు
NSDLతో సెక్యూరిటీలను కలిగియున్న వాటాదారులు	ఇమెయిల్: evoting@nsdl.co.in లేదా కాల్ చేయండి టోల్ ఫ్రీ నెం: 1800 1020 990 లేదా 1800 22 44 30
CDSLతో సెక్యూరిటీలను కలిగియున్న వాటాదారులు	ఇమెయిల్: helpdesk.evoting@cdslindia.com లేదా సంప్రదించండి: 022-23058738 లేదా 022-23058542-43

బోర్డు ఆదేశం మేరకు
లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ తరపున
సం/-
జి. వెంకటేశ్వర్ రెడ్డి
కంపెనీ సెక్రటరీ

ప్రదేశం: హైదరాబాద్
తేది: 31.08.2024

అక్షరం

"సౌమ్యవాద పథమ్ము
సౌమ్యమైన విధమ్ము
సకల సౌఖ్యప్రదమ్ము
ఓ కూనలమ్మ!"
- ఆరుద్ర



వాన దృశ్యాలు

ఇప్పుడు
తెలుగు గుండెలన్నీ
దిగులు గండ్లు పడిన దృశ్యాలు

లోపలంతా
వరద సుడుల బీభత్సం
నరాల నాళాలు మూసుకు పోయి
దుఃఖపు పొంగు
ఎగజిమ్మే దృశ్యాలు.

పంటలు చెట్లు
వంతెనలు రైలుకట్టలు
ముక్కలు చెక్కలై
ఆకాశం కొండ చెరియలుగా
విరిగి ధ్వంస రచన వేసిన దృశ్యాలు

ఊళ్ళు బీళ్ళు
నదులు ఏళ్ళు
సముద్రాలుగా వేషం కట్టిన
కన్నీటి దృశ్యాలు

గుడిసె బతుకులన్నీ
ప్రవాహ పాయల్లో
ఉత్త చేతులతో ఎదురీదే
చావు బతుకుల దృశ్యాలు.
చెరువులన్నీ
జల సర్పాలై ఊళ్ళను
మింగేసిన దృశ్యాలు
ఇప్పుడు
బతుకులన్నీ బురద నీటిలో
పూచిన కన్నీటి పుష్పాలు!

– మణీందర్
9948326270

అభయ జాగృతి

ఏ విస్ఫోటక వాస్తవం
నీ హృదయాంతరంలో సుడులు సుడులు తిరిగి
సడులు చేస్తోందో
ఆ సుడులు జడులై అలజడులై
తాకి తత్తరపడి బిత్తరపడిన కర్కోటక కార్పణ్యం
కక్ష గట్టి అల్లిన
కుట్రల సాలెగూడు
నీకు తెలియకుండానే
నీ చుట్టూ ఆ నిశీధి
నీ కలల చరిత్ర చివరి పేజీని
రక్తాక్షరాలతో రాస్తుంటే
నువ్వు ఆ క్షణంలో పూరించిన సమర శంఖం
140 కోట్ల హృదయాల ప్రతి స్పందనై
తరతరాల యుగయుగాల అతివల ఆక్రందనై
పాశవికతపై ఆటవికతపై
అలుపెరుగని పోరయింది బంగారు తల్లీ
బెంగాల్ చెల్లీ
నీ ఉజ్వల భవితను
నుజ్జు నుజ్జు చేసిన
భయంకర హత్యాచారం
రాక్షస రాజ్యపు చీకటికోణం బట్టబయల్జేసింది
తమ దుష్కృత్యాలపై అకృత్యపు కంబళి కప్పి
నిజాలకు సమాధి కట్టేసామనుకున్నాయి మృగాలు
కానీ,నీ కొన ఊపిరి పెనుగాలై
నీ గుండెమంట క్రోధాగ్ని జన సాగరమైంది
అచేతన హృదయాలను మేల్కొలిపింది
రేపటి తరాలకు అభయ జాగృతినిస్తోంది!

– కేతవరపు శ్రీనివాస్

ధీరవై రావమ్మా!

కామాంధుల రక్షక రాజ్యంలో
మగ రాబందుల పీడనలో
రక్షణ లేదని బతక లేనని
ఎందుకమ్మా ఏడుస్తావూ?

జన పీడకుల వధించిన కాళికవు
నరకాసుర మదమణిచిన సత్యవు
గత కథల ధ్యాసని కూడదీసుకో
యుద్ధమే తథ్యమైతే ధీరగా తేరుకో

ఏ కిరాతకానికైనా ఎక్కడో ఉంది వీక్నెస్
మాయల ఫకీరు ప్రాణం చిలకలో ఉన్నట్లు
మగాడి ప్రాణం వాడి అంగంలోనే ఉంది
పిడికిలిని పిడిబాకు చేసి అక్కడే పొడువ్
భయంవీడి మెదడుకు పదునెక్కించు
గురిచూసి అదునెప్పుడో గమనించు
పులిలా లంఘించి వాడంతం చూడు
ఎందుకంటే నువ్వు కావాలమ్మా జాతికి ...

రా! ఈ దేశ కూతురువై 'ధీర'గా రా ..
వీరవనిత ఝాన్సీవై జన్మభూమికి రా
నీ కోసం చూసే ఈ తండ్రుల కోసం రా
స్వరక్షా కీర్తి పతాకవై ఎగిరి మళ్ళీ రా!

– ఉన్నం వెంకటేశ్వర్లు
87900 68814

బాధిత స్వరం

అట్లా
ఆ నది ముందున్న చెట్టు మీద
వాన చినుకులా వాలిన పిట్ట
గాథాసప్తశతిలా ధ్వనిస్తోంది!

కూత కూతకి గొంతు
సానబెట్టిన కత్తి అంచులా
మోగుతోంది!
అరవగా అరవగా
పోగొట్టుకున్న జ్ఞాపకాల జాడలతో
ఆ స్వరంలో దుఃఖపు జీర!

ఏ పిట్టా
గొంతు కలపడం లేదు
పిట్ట వేదనకు చెట్టు సాక్ష్యం!
బాధితుడి భుజాన
ఏ మనిషి చెయ్యి వేయనట్టు
పక్షి పాటకి
ఎవరూ శృతి కలపరు!

– సుంకర గోపాలయ్య
94926 38547

'కాలం కత్తి మొనమీద' నలబై వసంతాల రంగుల చిత్రం

పరిచయం



"అక్షరాల ఆహారం
ఆకలితో తిని
పుస్తకాన్ని బోర్లించాను
పూలవనం లోంచి బైటపడ్డాను" (అక్షరాలే) అని చెప్పుకున్న కవి గా.ర. (గార రంగనాథం). ఇతను ఎంతటి అధ్యయనశీలో పై వాక్యాలను బట్టి అర్థమవుతుంది. అతి సున్నిత మనస్కుడైన కవి పలికించే ఆర్ద్రత, వేదన ఇతని వాక్యాల వెంట వొలుకుతుంటే పాఠకుల్లో కూడా గుండె బరువెక్కుతున్న స్పందన చూస్తాం. ఈ కవి తన 25 ఏళ్ల వయసు నుంచి 65 ఏళ్లు నిండే వరకు రాసిన కవితల్లోంచి కొన్నింటిని ఏరి ఒంజిపెట్టి 'కాలం కత్తి మొనమీద' రూపంలో సంకలించి మన ముందుకు తెచ్చారు. కళింగాంధ్ర నేలకు ఎంతో ప్రీతిపాత్రుడైన తెలంగాణ సాహితీవేత్త డా.సుంకిరెడ్డి నారాయణరెడ్డి ఈ పుస్తకానికి ఒక ముందుమాట రాశారు. కవికి స్వయానా అన్న గారైన పత్రికల విశ్రాంత సంపాదకులు సీనియర్ కవి 'నిజం' కలం పేరుతో ప్రసిద్ధులు గార శ్రీరామమూర్తి మరో ముందుమాట ఇచ్చారు. మొత్తం 60 కవితలున్న ఈ కవితా సంచయంలో వైవిధ్యభరితమైన వస్తువుల్ని కవి ఎంచుకున్న తీరు ఆసక్తిగా చదివిస్తుంది. నాలుగో వంతు కవితలు ప్రారంభ దశ ప్రయాణాన్ని చెబితే, మిగిలిన మూడొంతులు పరిణత స్థాయిని నిర్ధారిస్తున్నాయి. ఇలా రెండు స్థాయిల కవి ప్రయాణం మనకు కనిపిస్తుంది. ఈ మొత్తం కవితల్లో కళింగాంధ్ర ప్రాంతపు సామాజిక చలనశీలత, సంఘర్షణలు, గ్రామీణుల ఆచార వ్యవహారాలు అక్షరబద్ధం చేసిన విధానం కవి పరిశీలనా శక్తిని పట్టి చూపుతుంది. కాలం కొలరేఖ మీద గడసానిలా నడుస్తూ గతాన్ని భవిష్యత్తును సమన్వయించే చూపుతో వర్తమానాన్ని వ్యాఖ్యానించిన తీరు మనకు కచ్చితంగా నచ్చుతుంది. కొన్ని వాక్యాల దగ్గర కవి మనల్ని అమితంగా ఆకట్టుకుంటాడు.

'తెల్లవారి పాలనలో
చల్లబడిన తెలుగు గుండె'...
'జిన బుద్ధ శివ తత్వాలు త్రివేణులుగా
కృష్ణవేణి తరంగ వీచికలతో జత కలిసి
జ్ఞానం దిగంబరంగా వీస్తున్న నేల' (ఆంధ్ర నగరి)
'అభివృద్ధి ఆనందం వారి
నిఘంటువులో చేరని పదాలు
స్వాతంత్ర్యం ప్రజాస్వామ్యం
అక్కడి ఆకాశంలో ఎగిరే పళ్ళేలు' (అరకు)

ఇలాంటి వాక్యాలకున్న లోతు ఈ కవి అవగాహన వైశాల్యాన్ని వ్యాఖ్యానిస్తుంది.

సిక్కోలు గోడు వెల్లబోసే క్రమంలో, 'అభివృద్ధి అద్దంలో మాది
కాలుష్యపు మేడ!' అని ప్రకటించారు. కాలుష్య కారకాలైన ఫార్మాసూటికల్ కంపెనీలు తిష్టవేసిన నేలలోనే అణుభూతం థర్మల్ పడగ నీడలు ముసురుకోవడాన్ని ప్రశ్నిస్తారు. ఇదే అభివృద్ధి.. మీ బిడ్డలకు ఇక్కడే ఉద్యోగాలు వస్తాయని ఒప్పిస్తున్న పెట్టుబడి ఉపదేశాల కనికట్టు లోగుట్టును కవి పై వాక్యాల్లో బయటపెడుతున్నాడు. ఈ కవితలో నిర్దిష్టంగా ప్రాంతీయంగా మాట్లాడిన కవి మరో కవితలో దేశీయంగా వ్యక్తమైన తీరు ఎలావుందో చూడండి.

'నాగళ్ళన్నీ రోడ్డెక్కితే దేశమే ఓ దమ్ము మడి
దేశానికి తప్పదు పంట మార్పిడి'

ఈ క్రమంలోనే 'సిరాచుక్క' అనే మరో కవితలో ప్రపంచవ్యాప్త జాడ్యమైన రేసిజం గురించి కెన్నెడీ మిచమ్ అనే 20 ఏళ్ల బాలిక మెరియం వెబ్బర్ డిక్షనరీకి కొత్త అర్థాన్ని సూచించిన సందర్భాన్ని –

'ఆధిక్య భావనకు పైపైన గల తెల్లపూత తొలగించి
అల్పులనే భావనలోని కాఠిన్యాన్ని బైటపెట్టింది' అని రాశారు.

ఈ మూడు ఉటంకింపుల నుంచి చూస్తే ఈ కవి ప్రాంతీయ స్పృహతో ఎక్కువ కవితలు రాసినప్పటికీ జాతీయ అంతర్జాతీయ ప్రాధాన్యతల్ని కూడా స్పృశించారని అర్థమవుతుంది.

సర్వజన ఆసుపత్రిని గురించి కవి భావన చూడండి.

'నిత్యం పురిటి నొప్పులు పడుతూ
ఆరోగ్యాన్ని కంటూనే ఉంటుంది
అప్పుడప్పుడు శవాల్ని ఈనుతుంది'

ఈనుతుంది అన్న కళింగాంధ్ర వ్యక్తీకరణకు ఉలిక్కిపడతాం.

కవి దార్శనికతను పట్టించే స్టాంజా మరొకటి చూద్దాం.

'మరికొన్నాళ్ళాగితే
నీకో గుడికట్టి
వేదోక్తంగా అభిషేకించి
అభిషేక జలాలని మలిన వృత్తులపై జల్లి
శుద్ధి జేస్తామంటారు
చూస్తూండు గురజాడా!'

'మలిన వృత్తులు మాన్పి' అన్న గురజాడ మాటలు ఎలా వక్రీకరణకు గురవుతాయో చెబుతున్న తీరు ఆలోచింపజేస్తుంది. ప్రజల్లో హేతువాద చింతనను రూపుమాపడానికి మనువాదులు చేస్తున్న ప్రయత్నాల గురించి అప్రమత్తంగా ఉండమని కవి సూచిస్తున్నాడన్నమాట!

లింగ వివక్షకు సంబంధించిన వాస్తవికతను దృశ్యమానం చేసే క్రమంలో–

'కన్నవారికి హెచ్చు పుత్ర ప్రేమ
ఆడకూతురనిన ఆడపిల్ల (ఈడ పిల్ల కాదు అని ధ్వని)
అత్తవారికి ఆమె కబాబు పుల్ల' అంటారు.

అన్ని విధాల ఆమెను లోకువగా చూస్తూ రాచిరంపాన పెట్టే అత్తారింటి పరిస్థితుల్ని ఒక్కమాటలో చెప్పే పోలికిది. 'ఆకాశంలో సగం నీవు– సగం నేను' అన్నాడు శివసాగర్. చెరకు కూలీ పాలిట మహారాష్ట్ర మరో గల్ఫ్ ఎడారి అయిన వైనాన్ని చెబుతూ ఆమెను 'అందరిలో సగం' అంటున్నారు గా.ర. 1987లో జముకు బులిటెన్ కోసం రాసిన 'అశ్రు బిందువు' కవిత గా.ర.ను ఒక సిన్సియర్ కవిగా నిరూపించే కవిత, కళ్ల చెమర్చే కవిత. ఇందులో 'ఉరి తీయబడ్డ శవాల్లా వేలాడుతున్న రెండు చేతులు' అనే వాక్యం ఒక అభాగ్యురాలైన పదేళ్ళ బాలిక దీనస్థితిని వర్ణించడంలో పరాకాష్ఠ. 'చట్టం – ఈ అర్ధరాత్రి హేమంత వ్యవస్థలో ఆమెకు కప్పని వస్త్రం! న్యాయం – ఈ గ్రీష్మ తాపపు సమాజంలో ఆమెకు గుడ్డలేని గొడుగు' అంటూ ఆక్రోశిస్తారు.

అలాగే ఓ పదేళ్ళ కిందటెపుడో తను అమెరికా సందర్శించిన సందర్భంలో అక్కడి శీతల వాతావరణ పరిస్థితిని కవిత్వం చేస్తూ సామాజికాంశాలు మాట్లాడతాడు. నికనర్ పారా అనే చిలీ కవి, "యూఎస్ఏ / అక్కడ లిబర్టీ / ఒక స్టాట్యూ" అని రాస్తే మన కవి గార అక్కడి టైం స్క్వేర్ విచిత్రాల గురించి రాశారు. ఒకచోట 'ప్రపంచ శాసక డాలర్ మంత్రదండం/ మంచు కింద కట్టెపుల్ల/ వైట్ హౌస్ వీరునికి/ కట్టిన తెల్ల సమాధి' అన్నారు. మరో చోట 'స్టాట్యూ ఆఫ్ లిబర్టీ'ని 'స్వేచ్ఛావతి చేతి దివిటీ' అని తెలుగు జేశారు.

గా.ర. వ్యాసకర్తగా, విమర్శకునిగా, రాజాం రచయితల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడుగా తెలుగు సాహితీ లోకానికి సుపరిచితుడు. 2015 నుంచి ఇప్పటి వరకు వరుసగా 114 నెలవారీ సాహితీ సమావేశాలు రా ర వే పక్షాన జరిపించారు. లబ్ధప్రతిష్టులైన సాహితీ వెత్తలేందరినో ఆహ్వానించి ఆ వేదిక నుంచి మాట్లాడించారు. తన సంపాదకత్వంలో 'విస్మృత కళింగాంధ్ర సాహితీప్రభ' అనే వ్యాస సంకలనం వెలువరించారు. ఆముక్త మాల్యద కావ్యాన్ని విశ్లేషిస్తూ ఇతను రాసిన 'రాయరత్న మంజూష' అనే విమర్శనా గ్రంథం బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ వారు ప్రచురించారు. పద్యకవిత్వం కూడా రాసి ప్రచురించారు.

ఒక సీనియర్ సాహితీవేత్తగా గా.ర. తన అనుభవ జ్ఞానం నుంచి సృష్టించుకున్న ప్రతీకలు కొన్ని, పురాణ సాహిత్య పరిచయం వలన స్ఫురణకు వచ్చిన గురుతులు కొన్ని, సందర్భానుసారం భావ చిత్రాలు పద చిత్రాల అల్లికతో రూపు కట్టిన కొత్త ఇమేజరీలు కొన్ని. ఈ కవి ప్రయోగాత్మకంగా చేసిన విన్యాసాలు మరికొన్ని. మొత్తంగా ఈ 'కాలం కత్తి మొనమీద' కవితా సంచయాన్ని ఇవన్నీ కలిసి మంచి తూగుతో నిలుపుతున్నాయి.

'శిల్పం' అనే శీర్షికతో ఈ కవి రాసిన చక్కని కవిత చదివాక ఇతగానికి కవిత్వ నిర్మాణ రహస్యాలు చాలా బాగా తెలుసు అనే విషయం మనకు బోధపడుతుంది.

'శిల్పంలా చెక్కకుంటే/
చిత్రంలా తీర్చిదిద్దకుంటే/
ఒట్టి భావం కుమ్మరి తాకని మట్టి ముద్దే!' అంటారీయన.

'పద్యం పోత విగ్రహం/ వచన కవిత చెక్కిన శిల్పం' అని సూత్రీకరిస్తారు. 'రసాత్మకం కాని కవితలు/ వ్యర్థ జలాల దబదబలు' అని తీర్మానిస్తారు. అంచేత ఈ కవికి ఏది కవిత్వం కాదో ఆ స్పృహ ఉంది. అయితే కాళిదాసు కాలం నుంచి కవిత్వ సామ్రాజ్యాన్ని ఏలుతున్న ఉపమాలంకారం, తర్వాత దశలో రాజ్యం చేసిన రూపకం, అనేక ప్రయోగాలకు వేదికై నిలిచిన ఆధునిక ఇమేజరీ, ఇంకా కొనసాగుతున్న కొత్త మెటఫర్ల వేట, అదృశ్య రూపకాలను నిక్షిప్తం చేసే ప్రయోగశీలత.. ఇవన్నీ దాటుకొచ్చి ఇంకా ఇంకా ఆధునికానంతర దశలో అధునాతన రీతుల్లో తనను తాను నిత్యం కొత్తగా అలంకరించుకుంటోంది తెలుగు కవిత. ఈ మార్పులన్నింటికీ సుదీర్ఘకాలంగా అనుభావకుడిగా, ప్రత్యక్ష సాక్షిగా ఈ కవి ఉన్నారు అనే విషయం అతని వాక్యాలను బట్టి మనకు అర్థమవుతుంది. అందుకే గా.ర. భవిష్యత్తు కవిత్వ ప్రయాణం మరింత ఆసక్తిదాయకం.

మొత్తంగా చూసినప్పుడు ఈ కవికి తండ్రి హృదయశిఖి. పల్లె జీవితం ఇంబుడు గంధం కరిగిన కడవ. చిన్ననాటి అనుబంధాలన్నీ పొడుపు కథల తీయని బుగ్గపోట్లు. బాల్యమంతా నిలువీత, మునుగీత, వెనుకీత, ఎదురీతల సమాహారమై జ్ఞప్తికొచ్చే చెరువుబడి. నోట్ల రద్దు రహస్యమంతా ఒక దేవతావస్త్రం. పేదోడి బతుకంతా కంటి నుంచి జారే చెమట చుక్క. ఎప్పటికీ పాత బడని రాజ్యం హామీలన్నీ 'రూపాయి కూడా తగ్గని కంపెనీ బిడ్డల ధరలు'. అణు విద్యుత్ కేంద్రం అంటే లక్ష కోట్ల అగ్గిదిబ్బ. అందుకే 'కాలం కత్తి మొనమీద' కవిత్వం అంటే – 'నలబై వసంతాల రంగుల చిత్రం, ఎప్పటికీ చెరగని వెన్నెల స్వప్నం!'. కాపీల కోసం సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ : 98857 58123.

– కంచరాన భుజంగరావు
94415 89602

పోరాట చరిత్రల పరిశోధకుడు

నివాళి

డాక్టర్ కె. ముత్యం

1986 డిసెంబర్లో బెనారస్ హిందూ యూనివర్సిటీలో తెలుగు ఎంఏ చేద్దామని వారణాసి వెళ్లాను. మొదటి మూడు నాలుగు నెలలు చాలా సాధారణంగా గడిచిపోయాయి. నాలుగు నెలల తరువాత ఒక తుపాన్లా వచ్చాడు. తన పేరు ముత్యం అని చెప్పుకున్నాడు. 'అవునా సార్!' అంటే, 'సార్ ఏంటి? ముత్యం అని మాత్రమే పిలవండి' అన్నాడు. అక్కడి నుంచి మొదలైంది ముత్యంతో నా సాహితీ యాత్ర. నిజానికి పాపినేని శివశంకర్, కడియాల రామ్మోహన్ రాయ్ గార్ల దగ్గర ఇంటర్, డిగ్రీలలో పాఠాలు చదువుకున్నానే కానీ, వారి సాహిత్య కృషి గురించి పెద్దగా తెలియదు. వారిని ముత్యం నాకు పునః పరి చయం చేశాడు. చలం, గోపీచంద్, కోకు, బుచ్చిబాబు, రావిశాస్త్రి ఇత్యాదుల పుస్తకాలు రోజూ ఒకటి చొప్పున ఇచ్చి చదివించేవాడు. ఆ పుస్తకాల మీద చర్చలు పెట్టేవాడు. నేను సాహిత్యంలో ఈరోజు ఇలా ఉన్నానంటే దానికి పూర్తిగా కారణం ముత్యమే. తాను పరిచయం అవ్వడానికి పూర్వం నేను యండమూరి రచనలు అంటే పడి చచ్చేవాడిని. అలాంటి నాకు బాలగోపాల్ వ్యాస సంపుటి 'రూపం – సారం' ఇచ్చి చదవమన్నాడు. బాలగోపాల్ స్యూడో సైంటిఫిక్ నవలల మీద రాసిన వ్యాసం నా దిశను మార్చింది. పుస్తకాల్లోని అంశాలను వివరించి చెప్పడం కంటే, ఆ పుస్తకాన్ని ఇచ్చి చదవమని చెప్పి ఆ తర్వాత దాని మీద చర్చ పెట్టేవాడు.

ప్రచురణ సౌకర్యాలు ఇన్ని లేని కాలంలో తెలుగు డిపార్ట్మెంట్లో మాత్రమే తెలుగు టైప్ రైటర్ ఉన్న బనారస్ హిందూ యూనివర్సిటీలో యువ మిత్రులతో కలిసి వెలుగు పత్రికను నడిపాడు ముత్యం. దాదాపు 7 సంచికలు వచ్చాయి. నేను శ్రీశ్రీ ప్రతిజ్ఞ కవిత మీద రాసిన వ్యాసాన్ని వెలుగు పత్రికలో ప్రచురించాడు. స్థానిక హిందీ మిత్రులను కూడా చాలా సులువుగా కలుపుకొని, సరదాగా జోకులు వేసుకుంటూ, సీరియస్ విషయాల దగ్గర సీరియస్గా ఉంటూ, ఏ విషయం పట్ల అయినా నిర్దిష్టమైన నిక్కచ్చిగా తన అభిప్రాయాన్ని వెలిబుచ్చడం అతని దగ్గర చూశాను. అతనికున్న అనేక ఆసక్తుల్లో ఫొటోగ్రఫీ ఒక ప్రత్యేక ఆసక్తి. 1500 ఎకరాలకు పైగా ఉన్నా యూనివర్సిటీలో మారుమూల ప్రాంతాలకు వెళ్లి అక్కడ ఎవరూ అప్పటివరకు తీయని దృశ్యాలను ఎక్స్పోజ్ చేయాలని ఫొటోలు తీయడం అతని ప్రత్యేకత. సారనాథ్ వెళ్లినా దేవదరి, రాజ్ దరి వాటర్ ఫాల్స్కు వెళ్లినా, నేపాల్ వెళ్లినా ఏదో ఒక కొత్త కోణంలో ఫొటోలు తీసేవాడు.

యూనివర్సిటీలో మొదలైన మా స్నేహం పెళ్లిళ్ల అయిన తర్వాత కూడా కుటుంబాలతో సహా కొనసాగడం చాలా సంతోషకరమైన విషయం. రాయడంలో మెలకువలు మా గురువు పాపినేని గారి దగ్గర నేర్చుకున్నా, కవిత్వం రాయమని ప్రోత్సహించింది మాత్రం ముత్యమే. నా మొదటి కవితా సంపుటి 'చెమట చిత్తడి నేల' తన ప్రచురణ సంస్థ 'దృష్టి' ద్వారా తీసుకురావడమే కాక, 'దృష్టి సారిస్తూ' అంటూ నాలుగు ప్రోత్సాహక వాక్యాలు రాశాడు. బంకుపల్లి మల్లయ్య శాస్త్రి జీవితం, ప్రవహించే జ్ఞాపకం (గంటి రాజేశ్వరరావు జీవితం), పుల్లెల శ్యామసుందర్రావు జీవితం, సర్వదేవ పట్ల రామనాథం జీవితం, పిండిప్రోలు తదితర పుస్తకాల ప్రచురణలో నా పాత్ర కూడా ఉండడం సంతోషకరమైన విషయం.

శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యం మీద పరిశోధన చేసే క్రమంలో శ్రీకాకుళం జిల్లాలో ఉద్యమంలో పాల్గొన్న ప్రతి అనేక మందిని కలిసాడు. ఎన్నో గ్రామాలు సందర్శించాడు. వందలకొద్దీ పేజీల డాక్యుమెంట్లను సేకరించాడు. పదుల సంఖ్యలో ప్రముఖులను ఇంటర్వ్యూ చేసాడు. పిహెచ్డి చెయ్యడానికి ఐదేళ్లకాలం పడితే మూడున్నరేళ్లకు పైగా క్షేత్ర పర్యటనలోనే ఉన్నాడంటే ఎంత విస్తృతంగా సమాచార సేకరణ చేశాడో అర్థం అవుతుంది. ముత్యం ఎంచుకున్న పరిశోధనా ప్రణాళిక కూడా సాధారణ పరిశోధనల కంటే భిన్నమైనది. సిద్ధాంత వ్యాసం రాసే పరిశోధకులు ఎక్కువమంది ఇతరుల పుస్తకాల నుంచి లేదా ప్రముఖుల ఇంటర్వ్యూల నుంచి ఎక్కువ ఉటంకింపులు పేర్కొంటూ పెద్దగా తమదైన విశ్లేషణలు చేయరు. కానీ, ముత్యం ఏ పుస్తకం రాసినా అలభ్య వివరాలను మన ముందు ఉంచుతూనే, అందులోని అనేక అంశాలను విశ్లేషణ పూర్వకంగా వివరిస్తాడు. శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యంలో వస్తువు గురించి వివరిస్తూ పాణిగ్రాహి మొదలుకొని ఏజెన్సీ ఉద్యమ కవుల పాటల్లో వస్తున్న వస్తువును వారు ఎంచుకున్న విధానాన్ని వివరిస్తాడు. పాణిగ్రాహి పాటల్లో ఎరుపు, కమ్యూనిస్టులం అనే పాటల్లో దృక్పథ ప్రకటన, ఈ పాలన మనకెందుకు, దేశభక్తులు, దొంగాటకం పాటల్లో పరిపాలనలోని అస్తవ్యస్తతలు; మేలుకో, తెలుసుకో లాంటి పాటల్లో ప్రబోధాత్మకత ఎలా ఉంటుందో వివరిస్తాడు. ఉద్యమస్ఫూర్తితో ఉద్యమం కోసం వెలువడిన ప్రతి వాక్యాన్ని తరచి తరచి చూసి విశ్లేషణ చేశాడు ముత్యం. శ్రీకాకుళం జిల్లా భూగోళిక పరిస్థితుల నుంచి మొదలుపెట్టి గిరిజన ప్రాంతాల జనజీవనం వరకు, ఉద్యమ నేపథ్యంలో సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో పరిణామ క్రమం, ఉద్యమ ఘటనల నేపథ్యంలో వెలువడ్డ రచనల విశ్లేషణ మొదలైన విధాలుగా పరిశోధనను విభజించుకొని అధ్యాయాలుగా రచన సాగించాడు. మందస రైతుల ప్రతిఘటన చరిత్రను 'సునాముది జీవధార' పేరుతో ఒక పుస్తకంగా వెలువరించాడు ముత్యం. దీనిని ప్రజాశక్తి బుక్ హౌస్ ముద్రించింది. ఇప్పటి తరానికి ఈ చరిత్రను అందించాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తూ, 1967 ప్రాంతాల్లో శ్రీకాకుళం పోరాటానికి, 1940లలోనే బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా సాగిన మందస రైతుల పోరాట చరిత్ర ఎలా స్ఫూర్తిగా నిలిచిందో, రాజకీయ ప్రాధాన్యం ఉన్న పోరాటాల్లో సాహిత్యం తన పాత్రను ఎలా పోషించిందో తెలుసుకోవడానికి ఈ రచనలు ఉపయోగపడతాయి అంటాడు ముత్యం.

జీవిత చరిత్రలు సాధారణంగా పాఠకులకు స్ఫూర్తినిస్తాయి. అందునా ఉద్యమశీలురైన వారి జీవితాలు పాఠకుల్ని ఉద్వేగ పరుస్తాయి. ముత్యం నేను చిందుల ఎల్లమ్మను, బంకుపల్లి మల్లయ్య శాస్త్రి, సుబ్బారావు పాణిగ్రాహి, గరిమెళ్ళ, సర్వదేవభట్ల రామనాథం, సోయం గంగులు, మేర మల్లేశం, మార్పు పద్మనాభం, గానుగుల తరుణాచారి, బెందాళం గవరయ్య, పుల్లెల శ్యామసుందర రావు లాంటి వారి జీవిత చరిత్రలను అక్షరీకరించి నేటి తరానికి అందించాడు. తెలంగాణ ప్రాంతమంతా పర్యటించి ఆయా ప్రాంతాల సామెతలు (శాస్త్రాలు) జానపద గీతాలు ఎన్నింటినో సేకరించాడు. సామెతలు కొన్ని పుస్తక రూపంలో వచ్చాయి కానీ, జానపద గీతాలు రావాల్సి ఉంది. తన స్వీయ చరిత్రను కొంతవరకు రాశాడు కానీ అసంపూర్తిగా మిగిలిపోయి ఉంది. ముత్యం లాంటి అరుదైన పరిశోధకుడ్ని కోల్పోవడం తెలుగు సాహిత్య పరిశోధనకు తీరని లోటు.

– బండ్ల మాధవరావు
88976 23332

రంగస్థలపు చీకటివెలుగులు

పుస్తకం



ఆ వేదిక జనోల్లాసంతో బాటు జనచైతన్యాన్ని ప్రసరించే దీపికగా వెలుగొందింది. ఒకప్పుడు అది జనచైతన్యపు కాంతుల్ని విరజిమ్మిన ప్రధాన మాధ్యమంగా తెలుగునాట ప్రేక్షకులను అలరించింది. స్వాతంత్ర్యోద్యమం వంటి ఎన్నో ఉద్యమాల వెలుగుల్ని నాటకాల రూపంలో అది ప్రసారం చేసింది. ఎందరో ప్రసిద్ధ నటీనటులు తమ ప్రతిభాపాటవాలతో దానికి కొండంత గౌరవాన్ని కల్పించారు. ఒకప్పుడు వైభవంగా వెలిగిపోయి జనజీవననాడిగా అలరించిన ఆ రంగస్థలం నేడు ప్రపంచీరకణ మాటున ప్రచండగాలులై వీచే మాధ్యమాల ధాటికి తట్టుకోలేక సతమతమైపోతోంది. ఇప్పుడు కొన్ని నాటక సంస్థల ఆదరణ వెలుగుతో మాత్రమే రంగస్థలం తన వెలుగును ఇంకా పూర్తిగా కోల్పోకుండా మిణుకుమిణుకుమంటోంది. మూడు దశాబ్దాల పాటు ఆకాశవాణిలో వివిధ హోదాల్లో పనిచేసి, ఎందరో కళాకారుల జీవితాలను ప్రత్యక్షంగా చూసిన అనుభవంతో నిరంతరం నాటకరంగాన్ని అక్కున చేర్చుకొని అది మరింత వెలుగుతో నిండిపోవాలని తపిస్తూ ఆ రంగంలోని సాధకబాధకాలను అక్షరాలరూపంలో కూర్చిన అక్షర శ్రామికుల్లో ఆకుల మల్లేశ్వరరావు ఒకరు. దాదాపు పదేళ్లపాటు రంగస్థల యవనిక మీద జాలువారిన అనేక ప్రదర్శనలతో మమేకమై, వాటిలోని అనేక పార్శ్వాలను స్పృశిస్తూ, వాటిలోని మంచిచెడులను పరామర్శిస్తూ, వర్తమాన నాటక రంగంలోని ఎన్నో విశేషాలతో తాజాగా ఈయన వెలువరించిన వ్యాస సంకలనం 'రంగవీక్షణం'.

ఈ సంకలనంలోని వ్యాసాల వెనుక ఈ రచయిత పదేళ్ళ శ్రమ, తపన దాగివున్నాయి. 1988 నుంచి 2016 వరకు ఆకాశవాణిలో శ్రవ్య నాటికలు వివిధ రచయితల చేత రాయించి ప్రసారం చేయించిన ఈ రచయితకు ఆ నాటక రంగంలోని పలు పార్శ్వాల పట్ల, రంగస్థల పరిణామాల పట్ల ఎంతో అవగాహన వుంది. అనేక ప్రదర్శనలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించిన విస్తారమైన అనుభవమూ వుంది. వీటితోపాటు ఈ రచయిత రంగస్థలం పట్ల పెంచుకున్న యాభై ఏళ్ల అభిమానం కలగలిసి ఈ పుస్తకాన్ని ఒక నాటకరంగ దర్శినిగా తీర్చిదిద్దాయని చెప్పవచ్చు. ఈ సంకలనంలోని ఎక్కువభాగం వ్యాసాలు ఆయా ప్రదర్శనల సమీక్షల రూపంలోనూ, కొన్ని బళ్లారి రాఘవ వంటి మహానటుల స్ఫూర్తిదాయక ప్రసంగాలు, జీవనచిత్రాల రూపంలోనూ వున్నాయి. ఇంకొన్ని ఆధునిక ప్రదర్శనల్లోని ప్రయోగాలకు ప్రాధాన్యతనిచ్చాయి. ఆయా ప్రదర్శనల్లోని ఎన్నో పార్శ్వాలను ఈ వ్యాసాల్లో రచయిత స్పృశించడం వల్ల ఆ వ్యాసాలను చదివిన తరువాత అవి ఆ నాటకాలపైనా, ఆ నాటకాల్లోని పాత్రధారులపైనా మనకు ప్రేమనూ, అవగాహననూ కలిగిస్తాయి. రంగస్థలం పట్ల అభిమానాన్నీ పుట్టిస్తాయి. ఒకప్పుడు ఒక జాతరలా జరిగిన పలు నాటకోత్సవాలకు సంబంధించిన అనేక విషయాలను చెబుతాయి. ఆణిముత్యాలనదగ్గ వీరనారి ఝాన్సీబాయి, సరూ, చీకటిపువ్వు, రైతేరాజు వంటి పలు నాటికల్లోని ఆర్తిని మన హృదయాలకు తాకిస్తాయి. రంగస్థలంలో ఆనాటినుంచి ఈనాటి వరకూ జరిగిన అనేక పరిణామాలకు సాక్ష్యాలుగా కనిపిస్తాయి. ఎప్పటికప్పుడు తాను న్యాయనిర్ణేతగా పాల్గొన్న ఎన్నో నాటక ప్రదర్శనలకు సంబంధించి సమీక్షలను, కొన్ని ప్రదర్శనల నివేదికలను రూపొందించడంలో ఈ రచయిత పడ్డ శ్రమ ప్రశంసించదగ్గది. కన్యావరశుల్కం, చలం మైదానం వంటి వైవిధ్యభరితమైన నాటక ప్రదర్శనల్లోని ఆత్మలను ఈ వ్యాసాలు పట్టుకున్నాయి. రాజమండ్రిలో ఒకే వేదికపై 900 మంది 150 నిమిషాల నిడివితో ఇచ్చిన 'బారక్ పూర్ సే లాల్' అనే రంగస్థల ప్రదర్శన, హైద్రాబాదులో రెండు రోజుల్లో నాలుగు పూటల్లో రోజుకు 11 వంతున చోటు చేసుకున్న 22 ఏక వ్యక్తి రంగస్థల ప్రదర్శనలు, నిశుంభిరామ్ అనే నటుడు ఏకబిగిన ఇచ్చిన 27 ప్రదర్శనలు వంటి ప్రయోగాత్మక ప్రదర్శనల గురించి వివరించే వ్యాసాలు ఇందులో వున్నాయి. హాస్యం, వైజ్ఞానికం, మానవీయత, పర్యావరణం.. ఇలా మానవ జీవితంలోని పలు పార్శ్వాలను స్పృశించిన నాటకాల లోతుపాతుల్ని ఈ వ్యాసాలు చర్చించాయి. పలు నాటకాల్లోని సారాంశాల్నీ, ఆ నాటకాల తీరుతెన్నుల్నీ రచయిత మన ముందుంచేందుకు ప్రయత్నించడంతో ఆ నాటకాలను వీక్షిస్తున్న అనుభూతి కలుగుతుంది. ఇంకా ఈ వ్యాసాల్లో రాయలసీమకు చెందిన డాక్టర్ మూల మల్లికార్జునరెడ్డి వంటి నాటక పరిశోధకులు, మిశ్రో వంటి నాటక రచయితల జీవనచిత్రాలు కనిపిస్తాయి. ప్రదర్శనలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించేవారి నైపుణ్యానికి, వారు పాటించవలసిన నియమాలకు సంబంధించిన విషయాలను కూడా రచయిత చర్చించడం ముదావహం. బహుజనుల ఆత్మగౌరవం ఇనుమడించేలా బారతీయ సాంస్కృతిక పురాణ నేపథ్యాన్ని ఏవిధంగా ఉపయోగించుకోవాలో పేర్కొంటూ డాక్టర్ దీర్ఘాశి విజయకుమార్ రూపొందించిన నూతన రంగస్థలి నాటక కళ గురించిన వివరణ వుంది. చింతామణి నాటకాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం జీవో జారీచేయడంపై వెలువరించిన వ్యాసం సమకాలీన సామాజిక పరిస్థితుల్ని ప్రతిబింబిస్తుంది. పలువురు కళాకారుల బతుకుల్లోని కల్లోలాన్ని ప్రత్యక్షంగా చూసిన ఈ రచయిత ప్రభుత్వాలు వారి సంక్షేమం కోసం ఆరోగ్యపథకాన్ని ప్రవేశపెట్టాలని ఆకాంక్షిస్తారు. ఎంతో శ్రమకోర్చి, వ్యయం కోర్చి నాటక పరిషత్తులు నిర్వహించే పోటీల్లో ఎలాంటి నాటకాలను ప్రదర్శించాలో పేర్కొంటూ 'రచయితలు తమ కలంబలాన్ని వినియోగించవలసిన రీతిలో వినియోగించడం లేదు. తెల్ల కాగితాన్ని మంచి అక్షరాలతో నింపటం కోసం రచన చేపట్టాలి. కాగితాన్ని నలుపు (ఖరాబు) చేయడానికి కాదు. ఎవరికోసమో, వ్యక్తుల కోసమో, అవార్డుల కోసమో, కేవలం చప్పట్ల కోసమో కాకుండా నాటకప్రయోజనాన్ని విస్మరించకూడదు. సామాజిక బాధ్యతనుంచి తప్పుకోకూడదు' అని ఈ రచయిత ప్రస్తుత నాటక రచయితల సామాజిక బాధ్యతను గుర్తుచేశారు. ఆ సంకలనం వెనుకవున్న రచయిత ప్రధాన లక్ష్యం ఇదే.

ఈ సంకలనంలో ప్రపంచ రంగస్థల దినోత్సవానికి సంబంధించి కార్లోస్ సెల్రాన్, హెలెన్ మిర్రేన్ వంటి పాశ్చాత్య ప్రముఖుల సందేశాలు అనువాదాల రూపంలో చోటుచేసుకున్నాయి. రంగస్థల ఆవిర్భావ వికాసాలకు సంబంధించిన వివరణ వుంది. కథా రచయిత, నవలారచయిత చింతకింది శ్రీనివాసరావు రచనల్ని పరామర్శిస్తూ రచయిత వెలువరించిన సమీక్షలు ఆయన రచనల పట్ల అవగాహనను కలిగిస్తాయి. పలు నాటక ప్రదర్శనలను సమీక్షించేటప్పుడు ఆ నాటకాల్లో నటించిన పాత్రధారుల వివరాలను కూడా ఇవ్వడంలో ఈ రచయిత పరిశోధనాత్మక దృష్టి అవగతమవుతుంది. ఎన్నో ఏళ్ళుగా రంగస్థలానికి వన్నెలు దిద్దే ప్రముఖ నాటక సంస్థలకు ఈ వ్యాసాలు నీరాజనాలర్పించాయి. రంగస్థల ప్రదర్శనల పోటీలను నిర్వహించి ఆద్యంతం రక్తి కట్టించడం ఒక తతంగంలా బృహత్ ప్రణాళికతో కూడివుంటుంది. ఆ ప్రణాళికను రచయిత ఆకళింపు చేసుకున్న తీరును ఈ వ్యాసాలు తెలియజేస్తాయి. తెరమరుగవుతున్న తెలుగు నాటకం రూపురేఖల్ని కొంతవరకు దర్శింపజేస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే రంగస్థలంలోని చీకటి వెలుగుల్నీ, ఎందరో ఉద్దండ నటీనటుల అభినయ కౌశలాన్నీ ఈ వ్యాసాలు ఆవిష్కరించాయి. రంగస్థలాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరూ చదవదగిన పుస్తకమిది. 332 పేజీలున్న ఈ పుస్తకం వెల : రూ. 350. ప్రతులకు రచయితను 94400 07374 నెంబర్లో సంప్రదించొచ్చు.

– డాక్టర్ కొత్వాలు అమరేంద్ర
9177732414



జెడియుకి షాక్

- పార్టీ పదవికి త్యాగి గుడ్‌బై

పాట్నా : బీహార్‌లో నితీశ్ కుమార్ నేతృత్వంలోని అధికార జెడియు పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. పార్టీ ప్రతినిధి, సీనియర్ నేత జెడి త్యాగి తన పదవికి రాజీనామా చేశారు. బిజెపితో పార్టీకి ఉన్న విభేదాలపై ఆయన తరచూ గొంతు విప్పడం జెడియు నాయకత్వం జీర్ణించుకోలేకపోతోంది. త్యాగి రాజీనామా చేసిన విషయాన్ని జేడీయూ ఆదివారం ధృవీకరించింది. జెడియు అధ్యక్షులు, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ పార్టీ జాతీయ ప్రతినిధిగా రాజీవ్ రంజన్ ప్రసాద్‌ను నియమించారని తెలిపింది. త్యాగి వ్యక్తిగత కారణాలతో పార్టీ పదవికి రాజీనామా చేశారని జెడియు చెబుతోంది. అయితే కారణాలు మాత్రం వేరే ఉన్నాయి. ఆయన ఢిల్లీలో తరచూ చేస్తున్న వ్యాఖ్యలకు జాతీయ మీడియాలో విశేష ప్రాచుర్యం లభిస్తోంది. ఓ ప్రాంతీయ పార్టీ నాయకుడికి జాతీయ స్థాయిలో ఈ విధమైన ప్రాధాన్యత లభించడం అరుదుగానే జరుగుతుంది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆయన తరచూ చేస్తున్న విమర్శలు బిజెపి – జెడియు సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఉమ్మడి పౌరస్మృతి, వక్ఫ్ (సవరణ) బిల్లు, పాలస్తీనాపై మోడీ ప్రభుత్వ వైఖరి...ఇలా పలు వివాదాస్పద అంశాలపై త్యాగి తన వ్యాఖ్యలతో అటు కేంద్రాన్ని, ఇటు పార్టీని ఇబ్బంది పెడుతున్నారు. త్యాగి వ్యాఖ్యలు బిజెపిని ఇరకాటంలోకి నెడుతున్నాయని ఆ పార్టీ నాయకత్వం భావిస్తోంది. త్యాగి రాజీనామా నేపథ్యంలో ఢిల్లీలో పార్టీ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న కేంద్ర మంత్రి లలన్ సింగ్, జేడీయూ పార్లమెంటరీ పార్టీ నేత సంజయ్ ఝూలకు పరిస్థితిని చక్కదిద్దే బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది.

యుద్ధం వద్దు.. శాంతి కావాలి

- సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి – యంత్రాంగం

ప్రపంచంలో సుదీర్ఘకాలంగా రెండు యుద్ధాలు కొనసాగుతున్నాయని, వాటికి ప్రధాన సూత్రధారి అమెరికా సామ్రాజ్యవాదమని, తక్షణమే యుద్ధాలు ఆపి ప్రపంచ శాంతిని నెలకొల్పాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని, ప్రపంచ శాంతిని నెలకొల్పాలని, అమెరికా సామ్రాజ్యవాదం నశించాలని కోరుతూ సెప్టెంబరు ఒకటిన 'యుద్ధాలు వద్దు – శాంతి వర్ధిల్లాలి' నినాదంతో సంఘీభావ ప్రదర్శనలు చేపట్టాలని వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (డబ్ల్యుఎఫ్‌టియు) ప్రపంచ కార్మికవర్గానికి పిలుపునిచ్చిన క్రమంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం పలు జిల్లాల్లో శాంతి సంఘీబావ ర్యాలీలు నిర్వహించారు. విశాఖపట్నంలో నిర్వహించిన ర్యాలీలో నర్సింగరావు మాట్లాడుతూ పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించుకు నేందుకు ఇజ్రాయిల్ యుద్ధం ప్రారంభించిందని తెలిపారు. దీనికి ముందు రష్యా, ఉక్రెయిన్ యుద్ధం తలెత్తిందన్నారు. గాజాపై ఇజ్రాయిల్ ఇప్పటికే బాంబుల వర్షం కురిపించి అక్కడ సుమారు 39 వేల మంది ప్రజల ప్రాణాలు తీసిందని తెలిపారు. అమెరికా కనుసన్నల్లోనే భారతదేశం కూడా నడుచుకోవడం దురదృష్టకరమన్నారు. భారత ప్రధాని మోడీ ఉక్రెయిన్‌కు అమెరికా ప్రోత్సాహంతోనే వెళ్లారని తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల జంక్షన్ వద్ద, మందస మండల కేంద్రాల్లో శాంతి ర్యాలీ నిర్వహించారు. విజయనగరం జిల్లా గరివిడి, పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో కార్మికులు ర్యాలీలు చేపట్టారు. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో శాంతి సంఘీబావ ర్యాలీలు నిర్వహించారు.

శివాజీ విగ్రహం కూలిపోవడంపై
ప్రధాని క్షమాపణలు అహంకారపూరితం

- పవార్, ఉద్ధవ్ విమర్శ

షిండే బ్యానర్‌పై చెప్పుతో కొడుతున్న ఉద్ధవ్ థాకరే

ముంబయి : సింధు దుర్గ్‌లో శివాజీ మహరాజ్ విగ్రహం కూలిపోవడంపై ప్రధాని నరేంద్ర మోడీ క్షమాపణలు అహంకారపూరితంగా ఉన్నాయని ఎన్‌సిపి అధినేత శరద్ పవార్, శివసేన (యుబిటి) నేత ఉద్ధవ్ థాకరే విమర్శించారు. ఆదివారం దక్షిణ ముంబయిలోని ఐకానిక్ హుటాత్మా చౌక్ నుండి గేట్‌వే ఆఫ్ ఇండియా వరకు మహ వికాస్ అఘాడీ పాద యాత్ర నిర్వహించారు. విగ్రహ పతనానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమన్నారు. ఈ ఉదంతం అవినీతికి ఒక తిరుగులేని ఉదాహరణ అని వారు చెప్పారు. ఇక్కడికి 480 కి. మీ దూరంలోని మాల్వాన్ తహసిల్‌లోని రాజ్‌కోట్ కోటలో 17వ శతాబ్దపు మరట్వాడా రాజు శివాజీ విగ్రహాన్ని గత ఏడాది డిసెంబరు4న ప్రధాని మోడీ హడావుడిగా ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. గేట్‌వే ఆఫ్ ఇండియా వద్ద నిరసన కవాతునుద్దేశించి థాకరే మాట్లాడుతూ, 'ప్రధాని చెప్పిన ఆ క్షమాపణలో అహంకారాన్ని మీరు గమనించారా? ఆయన క్షమాపణ చెబుతుంటే పక్కన ఉన్న ఉప ముఖ్యమంత్రి నవ్వుతూ ఉన్నారు.' అని చెప్పారు. శివాజీ మహరాజ్‌కు జరిగిన అవమానం క్షమించరానిది, మహారాష్ట్ర ప్రజలు దీనిని ఎన్నటికీ క్షమించరని అన్నారు. బిజెపి భారత్ నుంచి వెళ్లిపోవాలని డిమాండ్ చేయడానికి మనమందరం ఇక్కడ సమావేశమయ్యామన్నారు. విగ్రహాలు కూలిపోవడాలు, రామ మందిరంలో ౧, కొత్త పార్లమెంటు భవనంలో లీకేజీలు ఇవే మోడీ ఇచ్చే గ్యారంటీలు అంటూ ఉద్ధవ్ ఎద్దేవా చేశారు. ప్రధాని దేనికి క్షమాపణలు చెప్పారు? ఎనిమిది నెలల క్రితం విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించినందుకా? అందులో అవినీతికి పాల్పడినందుకా? అని ప్రశ్నించారు. శివాజీ మహరాజ్‌ను అవమానించిన శక్తులను ఓడించేందుకు మహా వికాస్ అఘాడీ కేడర్ కలిసికట్టుగా కృషి చేయాలని ఆయన కోరారు.

ఎన్‌సిపి నేత పవార్ మాట్లాడుతూ, శివాజీ విగ్రహం కూలిపోయిన ఘటన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవినీతికి ఉదాహరణ అని చెప్పారు. మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలే మాట్లాడుతూ, శివద్రోహి (ఛత్రపతి శివాజీ విగ్రహానికి ద్రోహం చేసేవారు) ప్రభుత్వాన్ని క్షమించరాదన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ప్రధాని క్షమాపణలు చెప్పారని పటోలే అన్నారు.

జోడే మారో ఆందోళన్ (చెప్పులతో కొట్టడం) పేరుతో సాగిన ఈ నిరసన ర్యాలీలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సిఎం దేవేంద్ర ఫడ్నవిస్, అజిత్ పవార్‌ల పోస్టర్లపై శివసేన, ఎన్‌సిపి, కాంగ్రెస్ కార్యకర్తలు చెప్పులతో కొట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిపి అధినేత శరద్ పవార్, శివసేన (యుబిటి) నాయకుడు థాకరే, కాంగ్రెస్ రాజకీయ విభాగం చీఫ్ నానా పటోలే, ఆ పార్టీ ముంబయి నేత వర్ష గైక్వాడ్ తదితరులు పాల్గొన్నారు.

సినీ పరిశ్రమలో 'పవర్ గ్రూప్' లేదు : మమ్ముట్టి

- హేమ కమిటీ నివేదికను స్వాగతిస్తూ ప్రకటన

తిరువనంతపురం : మళయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు సహా పలు అంశాలకు సంబంధించి హేమ కమిటీ ఇచ్చిన నివేదికపై సూపర్ స్టార్ మమ్ముట్టి స్పందించారు. కమిటీ నివేదికపై ప్రముఖ నటుడు మోహన్ లాల్ మౌనం వీడిన మరునాడే మమ్ముట్టి పెదవి విప్పారు. హేమ కమిటీ నివేదికను మమ్ముట్టి స్వాగతించారు. తన అభిప్రాయం తెలియజేయడానికి ముందు మళయాళ మూవీ ఆరిస్టుల సంఘం, దాని నాయకత్వం అభిప్రాయం కోసం ఎదురు చూశానని తెలిపారు. మోహన్ లాల్ చెప్పినట్లుగానే సినీ పరిశ్రమలో 'పవర్ గ్రూప్' లేదని అన్నారు. కమిటీ నివేదిక కూడా ఇదే విషయాన్ని తెలియజేసిందని గుర్తు చేశారు.

'సమాజంలో మంచి, చెడు ఉన్న విధంగానే సినిమాలో కూడా ఉన్నాయి. సినీ పరిశ్రమలో ఉన్న వారు సమాజంలో భాగమే. అయితే సినీ పరిశ్రమను ప్రజలు నిశితంగా గమనిస్తుంటారు. అక్కడ ఏం జరిగినా చర్చ చోటుచేసుకుంటుంది. ఈ రంగంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చిత్రసీమలో పనిచేసే వారు జాగ్రత్తలు తీసుకోవాలి. గతంలో ఎన్నడూ జరగని విధంగా ఓ ఘటన జరగడంతో పరిశ్రమను అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేందుకు ప్రభుత్వం హేమ కమిటీని ఏర్పాటు చేసింది' అని మమ్ముట్టి ఆదివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కమిటీ సిఫారసులను, అది సూచించిన పరిష్కారాలను పరిశ్రమ హృదయపూర్వకంగా స్వాగతిస్తోందని, మద్దతు ఇస్తోందని తెలిపారు. వాటిని అమలు చేసేందుకు సినీ పరిశ్రమలోని అన్ని సంఘాలు ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు.

'ఇటీవల వచ్చిన ఆరోపణలపై పోలీసు విచారణ సమర్ధవంతంగా జరుగుతోంది. హేమ కమిటీ పూర్తి నివేదిక ఇప్పుడు న్యాయస్థానం ముందు ఉంది. పోలీసులను నిజాయితీగా విచారణ చేయనివ్వండి. శిక్షలను కోర్టు నిర్ణయిస్తుంది. కమిటీ తన నివేదికలో చేసిన ఆచరణ సాధ్యమైన సిఫార్సులను అమలు చేయాలి. న్యాయపరమైన అడ్డంకులు ఏర్పడితే అవసరమైన చట్టాలు రూపొందించాలి. అంతిమంగా సినిమా మనుగడ సాగించాలి' అని మమ్ముట్టి సూచించారు.

ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

- నాగ్‌పూర్‌లో సురక్షితంగా ల్యాండింగ్

న్యూఢిల్లీ : మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ నుంచి హైదరాబాద్ వస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది విమానాన్ని మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో అత్యవసరంగా సురక్షితంగా ల్యాండింగ్ చేశారు. విమానం టాయిలెట్‌లో ఈ బెదిరింపు లేఖ కన్పించింది. ఆదివారం ఉదయం 7.55 గంటలకు ఇండిగో విమానం జబల్‌పూర్ ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరింది. దాదాపు 9 గంటల ప్రాంతంలో ఓ ప్రయాణికుడు టాయిలెట్‌లోకి వెళ్లగా కమోడ్ సీటుపై ఒక పేపర్ కన్పించింది. దానిపై 'బ్లాస్ట్' అని రాసి ఉండటంతో వెంటనే సిబ్బందికి తెలిపారు. అప్రమత్తమైన పైలట్, విమాన సిబ్బంది ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌కు సమాచారమిచ్చారు. అనంతరం విమానాన్ని నాగ్‌పూర్‌కు మళ్లించారు. ఉదయం 9.20 గంటలకు విమానం నాగ్‌పూర్ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా దిగినట్లు అధికారులు తెలిపారు. ముందు జాగ్రత్త చర్యగా ఎమర్జెన్సీ సిబ్బంది, అంబులెన్స్‌లను విమానాశ్రయంలో సిద్ధంగా ఉంచారు. ప్రయాణికులను దించి వారి లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అయితే ఎలాంటి పేలుడు పదార్థాలు లభ్యం కాలేదు. విమానంలో 69 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉన్నారు. ప్రయాణికులను నాగ్‌పూర్ నుంచి బస్సులో హైదరాబాద్‌కు తరలించారు.

సుప్రీంకోర్టు పతాకాన్ని సిజెఐ జస్టిస్ చంద్రచూడ్‌తో కలిసి ఆవిష్కరిస్తున్న రాష్ట్రపతి ముర్ము

కోర్టుల్లో 'వాయిదాల సంస్కృతి' మారాలి

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆకాంక్ష

న్యూఢిల్లీ : సత్వర న్యాయం జరిగేలా కోర్టుల్లో 'వాయిదాల సంస్కృతి'లో మార్పు తీసుకొచ్చేందుకు తగిన చర్యలను చేపట్టాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. న్యాయాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత దేశంలోని న్యాయమూర్తులందరికీ ఉందన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు సభలో ఆమె ప్రసంగించారు. కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉండటం మనందరికీ పెద్ద సవాల్‌గా మారిందన్నారు. కోర్టుల్లో వాయిదాల సంస్కృతిలో మార్పు తీసుకొచ్చేందుకు సాధ్యమైన అన్ని ప్రయత్నాలను ముమ్మరం చేయాలని ఆమె సూచించారు. న్యాయస్థానాల్లో సామాన్యులు కొంత ఒత్తిళ్లకు గురౌతుంటారని, ఈ పరిస్థితిని 'బ్లాక్ కోర్టు సిండ్రోమ్'గా రాష్ట్రపతి అభివర్ణించారు. ఈ పరిస్థితిలోనూ మార్పు రావాల్సిన అవసరముందని తెలిపారు. న్యాయస్థానాల్లో మహిళా అధికారుల సంఖ్య పెరగడం పట్ల ముర్ము సంతోషం వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలోని 'భారత్ మండపం'లో జరిగిన ఈ కార్యక్రమంలో భారత ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్, కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, ఇతరులు పాల్గొన్నారు.

బెంగాల్‌లో మళ్లీ వేధింపుల కలకలం

కొల్‌కతా : పశ్చిమ బెంగాల్ రాజధాని కొల్‌కతా ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీలో జూనియర్ వైద్యురాలు హత్యాచారానికి గురైన ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్న సమయంలోనే ఈ రాష్ట్రంలోనే ఒక నర్సు నైట్‌షిఫ్టులో వేధింపులను ఎదుర్కోవడం కలకలం రేపుతోంది. భీర్భుమ్ జిల్లాలోని ప్రభుత్వాసుపత్రిలో శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. చోటోచక్ గ్రామానికి చెందిన అబ్బాస్ ఉద్దీన్‌కు జ్వరం రావడంతో అతడి కుటుంబసభ్యులు శనివారం రాత్రి 8.30 గంటలకు ఆసుపత్రికి తీసుకొచ్చారు. అతడిని పరీక్షించిన వైద్యులు సెలైన్ ఎక్కించడం కోసం వార్డుకు తరలించారు. అక్కడ విధుల్లో ఉన్న ఓ మహిళా నర్సు అతడికి సెలైన్ బాటిల్ ఎక్కిస్తుండగా ఆ రోగి అనుచితంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె ఆసుపత్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. తనను అభ్యంతరకంగా తాకడంతో పాటు అసభ్య పదజాలంతో మాట్లాడినట్లు ఫిర్యాదులో తెలిపారు. రోగి చేష్టలతో తాను భయభ్రాంతులకు గురయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులు హెచ్చరించినా అతడు వినిపించుకోలేదు. దీంతో వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సిటీ స్కాన్‌కు వెళ్తే బాలికపై..

రాష్ట్రంలోని హవ్‌డాలో మరో ఘటన వెలుగుచూసింది. ఓ 14 ఏళ్ల బాలికపై ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ వేధింపులకు పాల్పడ్డాడు. నిమోనియాతో బాధపడుతున్న ఆమె హవ్‌డా సర్దార్ ఆసుపత్రిలో సీటీ స్కాన్ కోసం వెళ్లగా.. ల్యాబ్‌లో పనిచేస్తున్న ఓ వ్యక్తి ఆమెతో అభ్యంతరకరంగా ప్రవర్తించాడు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని నిందితుడిని అరెస్టు చేశారు.

హసీనాను అప్పగించండి

- ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుదలకు తోడ్పడండి
- భారత్‌కు బిఎన్‌పి విజ్ఞప్తి

ఢాకా : బంగ్లాదేశ్ పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనాను తిరిగి వెనక్కి పంపించడం ద్వారా భారత్, బంగ్లా దేశ్ మధ్య సంబంధాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలకాలని మితవాద బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) ప్రధాన కార్యదర్శి జనరల్ మీర్జా ఫక్రుల్ అలంగీర్ చెప్పారు. ఆదివారం నాడు పార్టీ 46వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా షేర్–ఎ– బంగ్లా నగర్‌లోని జియావుల్ రహ్మాన్ సమాధి వద్ద నివాళులర్పించిన అనంతరం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, భారత్‌తో బలమైన సంబంధాలను తమ పార్టీ కోరుకుంటోందన్నారు. బంగ్లాదేశ్ గడ్డపై భారత్‌కు ముప్పు కలిగించే ఎలాంటి కార్యకలాపాలను బిఎన్‌పి ఎప్పటికీ అనుమతించదని ఆయన చెప్పారు. బిఎన్‌పి అధికారంలోకి వస్తే అదానీతో హసీనా ప్రభుత్వం కదుర్చుకున్న విద్యుత ఒప్పందాన్ని పునస్సమీక్షిస్తామని చెప్పారు. ఈ ఒప్పందం బంగ్లా దేశ్ ప్రజలపై తీవ్ర విద్యుత్ భారాలను మోపుతోందని, బంగ్లా ప్రజల్లో కూడా దీనిపై తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. అదే సమయంలో స్వేచ్ఛామార్కెట్ ఆర్థిక సంస్కరణలను తాము విస్తృతంగా అమలు చేస్తామన్నారు. హసీనాకు ఆశ్రయం కల్పించడం ద్వారా భారత్ బంగ్లా దేశ్ ప్రజల మనోభావాలను అర్థం చేసుకోవడంలో విఫలమైందని అలంగీర్ పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీల భద్రత గురించి విలేకరులు అడిగిన ప్రశ్నకు ఇది తమ అంతర్గత విషయం అన్నారు. హిందువులపై దాడులకు సంబంధించిన వార్తలు కచ్చితమైనవి కావన్నారు. వీటిలో చాలా ఘటనలు మత పరంగా జరిగినవి కావు, కేవలం రాజకీయ ప్రేరేపితమైనవి మాత్రమేనని ఆయన సెలవిచ్చారు. హసీనాను బంగ్లాదేశ్‌కు తిరిగి అప్పగించకపోతే భారత్‌తో సంబంధాలు మరింత క్షీణిస్తాయని ఆయన హెచ్చరించారు. హసీనా , ఆమె పాలనలో చోటు చేసుకున్న నేరాలు, అవినీతికి బంగ్లాదేశ్ చట్టాల ప్రకారం ఆమె విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుంది. దీనిని ప్రారంభించాలంటే అమెను బంగ్లాదేశ్‌కు తిరిగి అప్పగించేందుకు భారత్ చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. అసాధారణమైన ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు ఆగస్టు5న పతాక స్థాయికి చేరుకోవడంతో ప్రధాని హసీనా తన పదవికి రాజీనామా చేసి దేశం వీడి భారత్‌కు పారిపోయారు.

భారత్‌తో ఒప్పందాలను సమీక్షిస్తాం –విదేశీ వ్యవహారాల సలహాదారు

హసీనా ప్రభుత్వ హయాంలో భారత్‌తో కుదుర్చుకున్న ఒప్పందాలను సమీక్షించే అవకాశముందని తాత్కాలిక ప్రభుత్వ విదేశీ సలహాదారు తౌహిద్ హుస్సేన్ తెలిపారు. దేశ ప్రయోజనాలకు మేలు చేకూర్చేవిగా లేవని భావించిన వాటిని సమీక్షించవచ్చని ఆయన ఆదివారం నాడిక్కడ మీడియాకు తెలిపారు. ఒఐసి సమావేశంలో పాల్గొని కామెరూన్ నుండి తిరిగివచ్చిన అనంతరం హుస్సేన్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, ఈ విషయం తెలిపారు. షేక్ హసీనాను తిరిగి బంగ్లాదేశ్‌కు రప్పిస్తారా అని అడగ్గా, అవసరమైతే ఆమెను అప్పగించాలని ప్రభుత్వం భారత్‌ను కోరుతుందని అన్నారు. ఆమెను అప్పగిస్తారా లేదా అనేది భారత్‌పై ఆధారపడి ఉంటుందన్నారు. భారత్‌లో ఏ హోదాలో ఆమె ఆశ్రయం పొందుతున్నారని అడగ్గా, దాని గురించి తనకు తెలియదని చెప్పారు. ఈ ప్రశ్న మీరు భారత్‌నే అడగండని అన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందే..

- ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్

ప్రజాశక్తి – ఉక్కునగరం (విశాఖపట్నం)

పార్లమెంటులో ఎటువంటి చర్చా లేకుండా 2020 సెప్టెంబర్ 22, 23 తేదీల్లో ఆమోదించిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ డిమాండ్ చేశారు. వాటి రద్దుకు ఈ నెల 23న దేశవ్యాప్తంగా అన్ని కేంద్ర కార్మిక సంఘాలు బ్లాక్ డే పాటించనున్నాయని తెలిపారు. విశాఖ ఉక్కునగరంలోని గురజాడ కళాక్షేత్రంలో మూడు రోజులపాటు తలపెట్టిన ఎఐటియుసి ఆలిండియా జనరల్ కౌన్సిల్ సమావేశాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ప్రారంభ సభను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ కార్మికులు ఎన్నో సంవత్సరాలపాటు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కోవిడ్ సమయంలో చాపచుట్టేసి, కంపెనీల యాజమాన్యాలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. ఆ విషయమై కార్మిక సంఘాలతో కనీసం చర్చించలేదని తెలిపారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలు, లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ 2020 నవంబర్ 26న రైతాంగం 'ఢిల్లీ మార్చ్' ఏ విధంగానైతే చేపట్టిందో ఈ ఏడాది నవంబర్ 26న అఖిల భారత సమ్మెకు అదే విధంగా కేంద్ర కార్మిక సంఘాలు నిర్ణయించాయని తెలిపారు. ఆ సమ్మెలో రైతులు, కార్మికులు భారీగా పాల్గొంటారని కోరారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి కార్పొరేట్ స్నేహితుల ప్రయోజనాలే ముఖ్యమని విమర్శించారు. పెద్ద ఎత్తున ప్రకృతి వనరులను కార్పొరేట్లకు దోచిపెడుతోందన్నారు. ప్రజల సొమ్ముతో ఏర్పాటైన ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్లకు విక్రయించే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా 1297 రోజులుగా కార్మికులు చేస్తున్న పోరాటం చిరస్మరణీయమైనదన్నారు. త్యాగాల ఫలితంగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటైందని ఉద్ఘాటించారు. కేంద్రంలో బిజెపి మైనారిటీ ప్రభుత్వం ఉందని, దానికి రాష్ట్రంలోని టిడిపి మద్దతు ఇస్తోందని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మంచి ప్యాకేజీ వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిలిపివేత, సొంత గనుల కేటాయింపు, సెయిల్‌లో విలీనంపై ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షులు రామేంద్ర కుమార్, ఎపి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.రవీంద్రనాథ్, జి.ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

హర్యానా గేమ్ ఛేంజర్ వినేశ్..?

- రాజకీయ ఇన్నింగ్స్‌పై చర్చ

ఛండీగఢ్: హర్యానాలో అసెంబ్లీ ఎన్నికలకు కౌంట్‌డౌన్ షురూ అయ్యింది. అయితే ఎన్నికల వాతావరణాన్ని ప్రభావితం చేయడమే కాకుండా ఎన్నికల ఫలితాల్లో అనేక అంశాలు గేమ్ ఛేంజర్‌గా మారే అవకాశాలున్నాయి. వీటిలో ప్రస్తుత బిజెపి ప్రభుత్వంపై వ్యతిరేకత, రైతులు, మల్లయోధుల ఆందోళనలు, ప్రభుత్వ ఉద్యోగుల్లో అసంతృప్తి, జాట్ కమ్యూనిటీ మొదలైనవి కీలకపాత్ర పోషించనున్నాయి. ఈ ప్రధాన సమస్యల మధ్య.. ఈ ఎన్నికల్లో రెజ్లర్ వినేశ్ ఫోగట్ కూడా రాజకీయ రంగ ప్రవేశం చేయవచ్చనే ఊహాగానాలు అందరి దృష్టిని విశేషంగా ఆకర్షిస్తున్నాయి. శంభు సరిహద్దు వద్ద రైతు ఉద్యమం ప్రారంభమై 200 రోజులకు చేరిన సందర్భంగా.. వినేశ్ ఫోగట్ రైతుల వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. జింద్, రోహ్‌తక్‌లోని ఖాప్ పంచాయతీ నాయకులను కలిశారు. జింద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వినేశ్ తన రాజకీయ ప్రవేశం గురించి మాట్లాడుతూ... "నా మనస్సు స్పష్టంగా ఉన్నప్పుడు, నేను ఏమి చేయాలో ఆలోచిస్తాను. ఎందుకంటే నేను ఇంకా తీవ్ర షాక్‌లో ఉన్నాను".అని వివరించారు. వాస్తవానికి వినేశ్ సోదరుని భార్య బబితా ఫోగట్ 2019 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి టిక్కెట్‌పై దాద్రీ స్థానం నుంచి పోటీ చేశారు. అయితే వినేశ్ రెజ్లర్‌లపై లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా సాగించిన ఆందోళనలు రాజకీయంగా బిజెపిని ఇరుకున పెట్టాయి. ఈ నేపథ్యంలో దాయాదుల మధ్య రాజకీయ విభేదాలు కూడా బయటపడ్డాయి. బబిత, ఆమె భర్త సోషల్ మీడియాలో వినేశ్‌ను పరోక్షంగా లక్ష్యంగా చేసుకున్నారు. దీని కారణంగా ఇద్దరి మధ్య విభేదాలు మరింత స్పష్టంగా కనిపించాయి.

హర్యానాలో వినేశ్ వర్సెస్ బబిత...

ఆసక్తికరమైన విషయం ఏమిటంటే వినేశ్ కనుక ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకుంటే రాష్ట్రంలో రాజకీయ సమీకరణలు మారిపోయే అవకాశాలు మెండుగా ఉన్నాయి. 2019లో బబిత పోటీ చేసిన దాద్రీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బబితపై ఆమె పోటీ పడవచ్చని సబంధికులు చెబుతున్నారు. రాష్ట్రంలో మల్లయోధులు, ప్రతిపక్ష పార్టీలు బ్రిజ్ భూషణ్ సమస్యను సజీవంగా ఉంచాయి. బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలో సాక్షి మాలిక్, వినేశ్ ఫోగట్ , బజరంగ్ పునియాతో సహా చాలా మంది రెజ్లర్లు పాల్గొన్నారు. బజరంగ్ పునియా నిరసనకు చిహ్నంగా తన పద్మశ్రీని కూడా తిరిగి ఇచ్చాడు. ఇది గత లోక్‌సభ ఎన్నికలను కూడా ప్రభావితం చేసింది. ప్రస్తుత హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో కూడా కీలక అంశంగా మారనుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

జాట్, రైతు సంఘాల పాత్ర

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు లాభం చేకూర్చడంతో జాట్ సామాజిక వర్గం, రైతుల ఓట్లు కలిసివచ్చాయి. గ్రామీణ ప్రాంతాల్లో 42 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పైచేయి సాధించింది. ఇది గ్రామీణ ప్రాంతాల్లో హర్యానా ప్రజలు కాంగ్రెస్‌కే ఓటు వేసినట్టు సూచించింది. ఈ అసంతృప్తి పరివార్ పెహచాన్ పత్ర పథకం కింద జరుగుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియ పట్ల విముఖతతో ఉన్న గ్రామ సర్పంచ్‌లు, సాధారణ రైతులలో కూడా కనిపిస్తోంది. హర్యానాలో బీజేపీకి వ్యతిరేకంగా వీస్తున్న పవనాలు.. కేవలం జాట్‌లు, రైతులకు మాత్రమే పరిమితం కాదు. మల్లయోధులు, సర్పంచ్‌లు కూడా డబుల్ ఇంజిన్ ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నారు. 2019లో 10 లోక్‌సభ స్థానాలు ఉన్నప్పటికీ, ఒక్క జాట్ నాయకుడిని కూడా కేంద్ర ప్రభుత్వంలో చేర్చుకోలేదు. 2014 నుంచి ఏ జాట్ నేతనూ ముఖ్యమంత్రిని చేయలేదనే కోపం ఆ వర్గంలో రగులుతోంది.

బ్రిజ్ భూషణ్ వివాదంపై బబితా ఫోగట్ ఏమన్నారు?

బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో వినేశ్ ఫోగట్ చురుకుగా పాల్గొన్నారు. అయితే ఈ రెజ్లర్ల ఉద్యమాన్ని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారని బబితా ఫోగట్ ఆరోపించారు. వినేశ్ కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని, ఒకవేళ ఆమె ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకుంటే, దాద్రీ అసెంబ్లీ స్థానంలో పోటీకి దిగే అవకాశం ఉందని కూడా చెబుతున్నారు. కాగా వినేశ్ ఫోగట్ క్రియాశీల రాజకీయాల్లోకి వస్తే ఆమె కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉందని రాజకీయంగా చర్చ జరుగుతోంది. మరోవైపు ఖాప్ పంచాయితీలు వినేశ్‌కు బంగారు పతకాన్ని ప్రదానం చేశాయి. నేను కష్టాల్లో ఉన్నప్పుడు రైతులు నన్ను ఆదుకున్నారు' అని ఆమె అన్నారు. ఏది ఏమైనా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వినేశ్ ఫోగట్ పాత్ర హర్యానా రాజకీయాల్లో కీలక మలుపుగా మారనుంది.

తెలంగాణలో భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

వైపు మళ్లించారు. పాలేరు వాగు ప్రవాహం తగ్గితే వాహనాల రాకపోకలకు అనుమతిస్తామని పోలీసులు తెలిపారు. కోదాడ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వైష్ణవి పాఠశాల సమీపంలోని వాగులో రెండు కార్లు, ఆటోలు వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. వరదలో కొట్టుకొచ్చిన కారులో ఓ మృతదేహం ఉన్నట్లు అధికారులకు స్థానికులు ఆదివారం ఫిర్యాదు చేశారు. మృతుడు రవిగా నిర్ధారించారు. శ్రీమన్నారాయణ కాలనీలో శ్రీనివాసనగర్‌కు చెందిన టీచర్ వెంకటేశ్వర్లు మృతదేహం లభ్యమైంది. భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు.

Piramal Finance

పిరామల్ క్యాపిటల్ & హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

CIN : L65910MH1984PLC032639

రిజిస్టర్డ్ ఆఫీసు : యూనిట్ నెం.601, 6వ అంతస్తు, పిరామల్ అమితి బిల్డింగ్, పిరామల్ అగస్త్యా కార్పొరేట్ పార్క్, కమాని జంక్షన్, ఫైర్ స్టేషన్ ఎదురుగా, ఎల్‌బిఎస్ మార్గ్, కుర్లా (వెస్ట్), ముంబయి–400070. టెలి : +91 22 3802 4000.

బ్రాంచ్ ఆఫీసు : డోర్ నెం.7-1-615, 616 & 617/ఎ, ఇంపెరియల్ టవర్స్, 4వ అంతస్తు, అమీర్‌పేట్ మెయిన్ రోడ్, హైదరాబాద్–500016, తెలంగాణ.

సంప్రదించు వ్యక్తి : 1) దుర్గ విజయ ప్రసాద్ వానచర్ల-9493330003, 2) రమణ రావు-9849271633, 3) రోహన్ సావంత్ -9833143013

ఇ- వేలం అమ్మకపు ప్రకటన- తాజా అమ్మకం

రుణగ్రహీత/ల నుండి బకాయి మొత్తాల రికవరీ కొరకు **సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002** క్రింద పిరామల్ క్యాపిటల్ & హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిచే దిగువ పేర్కొన్న సెక్యూర్డు అసెట్ యొక్క స్వాధీనం చేసుకునేందుకు అనుగుణంగా భౌతిక స్వాధీనంలోని దిగువ వివరించినట్లుగా స్థిరాస్తి యొక్క కొనుగోలు కొరకు **"ఎక్కడ ఎలా ఉన్నది, అక్కడ అది అలాగే ప్రతిపాదికన"** క్రింది సంతకందారుడు ఆఫర్లను ఆహ్వానిస్తున్నారు, వివరాలు దిగువ విధంగా ఉన్నాయి.

లోన్ కోడ్ / బ్రాంచ్ / రుణగ్రహీత(ల) సహ–రుణగ్రహీత(ల) / హామీదారు(లు)	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	ఆస్తి వివరణ– ఫైనల్	రిజర్వు ధర	ధరావత్తు (ఈఎండి) (ఆర్‌పిలో 10%)	బాకీపడిన మొత్తం (29-08-2024)
లోన్ కోడ్ నెంబరు : ఎం 0167793, విజయవాడ (బ్రాంచ్), రత్న కుమార్ దేవతోటి (రుణగ్రహీత), హుల్లా దేవతోటి (సహ–రుణగ్రహీత 1)	తేది.06-03-2024, రూ. 23,18,439/- (రూపాయలు ఇరవైమూడు లక్షల పద్దెనిమిదివేల నాలుగు వందల ముప్పైతొమ్మిది మాత్రమే)	డోర్ నెం.37-5/1-8, ఎన్.టి.ఎస్ నెం : 33, బాడవపేట, లబ్బీపేట, విజయవాడ, ఎన్‌టిఎస్ నెం.33, బాడవ పేట, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-520010 లోగల విస్తీర్ణపు ఆస్తి కలిగియున్న మొత్తం భాగం.	రూ. 23,14,000/- (రూపాయలు ఇరవైమూడు లక్షల పద్నాలుగు వేలు మాత్రమే)	రూ. 2,31,400/- (రూపాయలు రెండు లక్షల ముప్పై ఒకవేల నాలుగు వందలు మాత్రమే)	రూ. 24,75,375/- (రూపాయలు ఇరవైనాలుగు లక్షల డెబ్బైఐదు వేల మూడు వందల డెబ్బై ఐదు మాత్రమే)

ఇ-వేలం తేది : 08-10-2024, ఉ॥ 11.00 గం.ల నుండి మ. 2.00 గం.ల వరకు (ప్రతి 5 నిమిషాల చొప్పున అపరిమిత పొడిగింపుతో), బిడ్ దాఖలు చేయుటకు చివరి తేది : 07-10-2024, సా.4.00 గం.లకు ముందు.

అమ్మకం యొక్క వివరణాత్మక నియమ నిబంధనల కొరకు దయచేసి, www.piramalfinance.com/e-Auction.html లో కల్పించిన లింక్‌ను చూడండి లేదా piramal.auction@piramal.com ద్వారా మాకు ఇమెయిల్ చేయండి.

రుణగ్రహీత / హామీదారు / తాకట్టుదారుకు SARFAESI చట్టం క్రింద చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకపు ప్రకటన

వేలం తేదీకి ముందు తేదీ వరకు వర్తించు వడ్డీతోసహా పూర్తిగా సెక్షన్13(2) నోటీసులో పేర్కొన్నట్లుగా పూర్తి బకాయిని చెల్లించవలసిందిగా పై పేర్కొన్న రుణగ్రహీత/హామీదారును కోరబడుచున్నది, విఫలం చెందిన ఏదైతే, ఆస్తి వేలంచేయబడుతుంది మరియు మిగతా బకాయిల కొరకు రుణగ్రహీత / హామీదారు నుండి వడ్డీ & ఖర్చులు ఏవేని ఉన్నట్లైతే వారి నుండే వసూలు చేయబడుతుంది.

సం/- (అధీకృత అధికారి), పిరామల్ క్యాపిటల్ & హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

తేది : 02-09-2024, ప్రదేశం : క్రిష్ణా

GRIHUM HOUSING FINANCE Apna Ghar. Apni Pehchan.

గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

(గతంలో పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తెలిసినది)

రిజిస్టర్డు ఆఫీసు: 602, 6వ అంతస్తు, జీరో వన్ ఐటి పార్కు, క్రసం. 79/1, గోరేపాడి, ముంధ్వా రోడ్, పూణె-411036.

అనుబంధం-4 (రూల్ 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు **గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో పూనావాల హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ అనునది, 17 నవంబర్, 2023 నుండి గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మారినది) (గతంలో మగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ మరియు ఒరిజినల్‌గా జిఇ మనీ హౌసింగ్ ఫైనాన్స్ పబ్లిక్ అన్‌లిమిటెడ్ కంపెనీ పేరున ఇన్‌కార్పొరేటెడ్)** ఇందు తదుపరి పై కార్పొరేట్ /రిజిస్టర్ ఆఫీసు యొక్క సెక్యూర్డ్ క్రెడిటర్‌గా పేర్కొనబడును, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇందు తదుపరి "సదరు చట్టం"గా పేర్కొనబడును) మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, దిగువ తేదీన డిమాండ్ నోటీసు జారీచేసి, దిగువ రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగిచెల్లించవలసిందిగా కోరబడినది. రుణగ్రహీత మొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002లోని సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు దిగువ వివరించిన ఆస్తిని దిగువ పేర్కొన్న తేదీలలో క్రింది సంతకందారు **28 ఆగష్టు, 2024**న స్వాధీనంచేసుకున్నారు. ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, సెక్యూర్డ్ క్రెడిటర్‌కు మొత్తాలను మరియు దానిపై వడ్డీతోసహా చెల్లించుటకులోబడి ఉంటుంది. సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టంలోని సెక్షన్-13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీతలు శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది. స్వాధీనంచేసుకొన్న ఆస్తి వివరాలు ఇందు దిగువ విధంగా ఉన్నవి.

క్ర సం.	రుణగ్రహీతల పేరు	ఆస్తి వివరణ	స్వాధీనంలోకి తీసుకున్న తేది	చట్టబద్ధ డిమాండ్ నోటీసు తేది	డిమాండ్ నోటీసులో మొత్తాలు (రూ.)
1.	పఠాన్ రఫీ ఖాన్, పఠాన్ గౌసియా	ఫ్లాట్ నెం: ఎస్ఎఫ్-3, రెండవ అంతస్తు, శ్రీ వెంకటరమణ నిలయం, సర్వే నెం.178, పెదపులిపాక పంచాయితీ, పెనమలూరు మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం 750 చ.అ.లు. సిటీ ఆఫ్-విజయవాడ, విజయరాజేశ్వరి టెంపుల్ దగ్గర, ఆంధ్రప్రదేశ్-521137. **సరిహద్దులు: తూర్పు:** ఒపెన్ టు స్కై, **పడమర:** ఒపెన్ టు స్కై, **ఉత్తరం:** ఒపెన్ టు స్కై, **దక్షిణం:** ఫ్లాట్ నెం.ఎస్ఎఫ్-2 జాయింట్ వాల్ మరియు కామన్ కారిడార్.	28/08/2024	07/10/2023	రుణ నెం: HL0053H16100063 07.10.2023 నాటికి చెల్లించాల్సిన మొత్తాలు రూ.17,21,528.21/- (రూపాయలు పదిహేడు లక్షల ఇరవైఒకవేల ఐదువందల ఇరవై ఎనిమిది & ఇరవైఒక పైసలు మాత్రమే) రియలైజేషన్ వరకు వార్షికంగా 14.80% వడ్డీతోసహా.

ప్రదేశం: క్రిష్ణ, తేది: 02.09.2024

సం/- అధీకృత అధికారి, గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తెలిసినది)

తప్పు తెలుసుకున్న కప్ప



అనగనగా ఒక చెరువు. ఆ చెరువు పక్కనే అందమైన పూల తోట ఉండేది. చెరువులో ఒక కప్ప నివసించేది. పక్కన పూల తోటలో ఒక మిడత నివాసం ఉండేది. మిడతకు, కప్పకు మంచి స్నేహం ఏర్పడింది. కానీ అవి ఎప్పుడూ ఒకరి ఇంటికి ఒకరిని ఆహ్వానించుకోలేదు.

ఒకరోజు చెరువు ఒడ్డున కప్ప, మిడత కూర్చొని ముచ్చట్లు పెట్టుకున్నాయి. 'మిస్టర్ మిడత! ఈరోజు రాత్రి మీరు మా ఇంటికి భోజనానికి రండి' అని కప్ప, మిడతను ఆహ్వానించింది.

మిడత వచ్చేసరికి చెరువు ఒడ్డున కొవ్వొత్తులను వెలిగించింది కప్ప. మిత్రుని ఏర్పాట్లను చూసి మిడత చాలా సంతోషించింది. 'రా మిత్రమా! కలిసి భోజనం చేద్దాం' అని మిడతను ఆహ్వానించింది. 'వెళ్లి చేతులు కడుక్కొని రా' అని చెప్పింది కప్ప. చేతులు కడుక్కొని వచ్చిన మిడత ఆహారం తినే ముందు రెండు చేతులను రుద్దుకుంది. అది చూసిన కప్ప 'ఏంటి మిస్టర్ మిడతా! చేతులను అలా రుద్దుతున్నావు? నువ్వు చేతులు కడుక్కొని ఏం ప్రయోజనం' అని వెటకారంగా అన్నది. మిడత లోలోపలే బాధపడిపోయింది. భోజనం పూర్తి చేసి 'సరే వస్తాను. నువ్వు కూడా రేపు మా ఇంటికి రావాలి' అని ఆహ్వానించింది మిడత. కప్ప సరేనన్నది.

పూలవనానికి చేరుకున్న మిడత మరో మిత్రుడైన తూనీగతో జరిగిన సంగతిని చెప్పి బాధపడింది. మరుసటి రోజు కప్ప భోజనానికి వచ్చింది. సంతోషించిన మిడత 'మిత్రమా వెళ్ళి చేతులు కడుక్కొని రా' అని అన్నది. కప్ప చేతులు కడుక్కొని గెంతుకుంటూ వచ్చింది. అది చూసిన తూనీగ, 'చేతులు కడుక్కొని ఏం లాభం?" అని కప్పను అనబోయింది. పక్కనే ఉన్న మిడత 'వద్దు' అని వారించింది. సంతోషంగా అవి మూడు కలిసి భోజనం చేశాయి. నిన్న రాత్రి మిడతను అన్న మాటలు కప్పకు గుర్తుకు వచ్చాయి. 'నేను మిడతను నిన్న అవమానించినా అది మనసులో పెట్టుకోకుండా, నన్ను అవమానించబోయిన తూనీగను అడ్డుకున్నది. నేను చాలా తప్పు చేశాను' అని మనసులోనే బాధపడింది కప్ప. ఆ రోజు నుండి ఎప్పుడూ ఒక్కమాట కూడా మిడతను అనలేదు. అవి మూడు కలిసి స్నేహంగా ఉండసాగాయి.

- షేక్ హస్మత్,
8 వ తరగతి,
జెడ్‌పిహెచ్ఎస్, కోదాడ,
సూర్యాపేట.

లెక్కల తమాషా

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన గళ్లల్లో 1 నుండి 9 అంకెలను పక్కనే ఇచ్చిన సమాధానాలు వచ్చేలా రాయండి. ఏ అంకెనూ రెండు సార్లు ఉపయోగించకూడదు మరి! ట్రై చేయండి.

	-		+		=	6
-		+		-		
	+		-		=	14
+		-		+		
	-		+		=	5
=		=		=		
9		10		4		

నేను గీసిన బొమ్మ

ఘంటసాల మోహిత్ వెంకట దుర్గారావు,
3వ తరగతి,
ఎంపిపిఎస్, చటాకాయ,
కైకలూరు మండలం,
ఏలూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వరదల్లో జాగ్రత్త సుమా...

వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. ఆదివారం కూడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎపి విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించిన విషయం తెలిసిందే. తీరప్రాంతంలో 45 - 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఈ అల్పపీడన ప్రభావంతో గత మూడురోజులుగా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతున్న విషయం తెలిసిందే. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నదులు, చెరువులు, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాలతోపాటుగా పట్టణాలు, నగర పంచాయతీల పరిధిలోని మురికివాడలు, లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. మురుగునీరు పొంగిపొర్లుతుండటంతో తాగే మంచినీరు కలుషితమయ్యే ప్రమాదం పొంచివుంది. ఈ క్రమంలో రోజువారీ కార్యక్రమాలను నిర్వహించుకోవటానికి ప్రతి ఒక్కరూ ఇంటి నుంచి బయటకు వెళ్లటం తప్పదు. ఇలాంటి పరిస్థితుల్లో కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా వర్షంలో బయటకు వెళ్లినా తడవకుండా ఉంటారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం



వర్షాలు కురిసే సమయంలో ఎక్కువగా తడిస్తే అనారోగ్య సమస్యలు దాపురించే ప్రమాదం ఉంది. కొన్ని చిన్న జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి రోగం మనల్ని దరిచేరకుండా ఉంటుందని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. వర్షాల సమయంలో వైరల్ ఇన్ఫెక్షన్లను అరికట్టడంలో సహాయపడే కొన్ని ప్రభావవంతమైన చిట్కాలు ఇవే...

- ఎక్కువగా వర్షంలో తడవకుండా ఉంటే చాలా వరకూ కొన్ని రకాల వ్యాధుల నుంచి బయటపడొచ్చు.
- జలుబు, దగ్గు, చిన్నపాటి జ్వరం వస్తూ ఉంటాయి. ఇలాంటప్పుడు కాచి చల్లార్చిన నీటిని తాగుతూ ఉండాలి. ఎలాంటి పరిస్థితుల్లో మంచినీటిని డైరెక్ట్‌గా తీసుకోవడం మంచిది కాదు.
- వంట చేయడానికి ముందు కూరగాయలు, తినే ముందు పండ్లను బాగా కడగాలి. దుమ్ము, ధూళి, హానికరమైన బ్యాక్టీరియాకు ఇవి గురవుతూ వైరల్ ఇన్ఫెక్షన్‌లను కల్గిస్తాయి.
- వేడివేడి ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. నిల్వవుంచిన ఆహార పదార్థాలను తింటే ఇన్‌ఫెక్షన్ వచ్చి రోగ నిరోధక శక్తి తగ్గే అవకాశం ఉంటుంది. .
- బయట ఆహారాన్ని తినటం మానేయాలి. కట్ చేసిన పండ్లను వెంటనే తినేయాలి.
- నీరు నిల్వవుండకుండా మీ చుట్టూ ఉండే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి. కొంతవరకు వైరల్ ఇన్ఫెక్షన్లను నివారించొచ్చు.
- భోజనానికి ముందు, తర్వాత వేడి నీళ్లతో చేతులు కడుక్కోండి
- దగ్గు, జలుబుతో బాధపడుతుంటే మీ ఆహారం, పానీయాలను ఎవరితోనూ పంచుకోవద్దు
- వ్యాధి సోకిన వ్యక్తి నుంచి ఆరోగ్యకరమైన వ్యక్తిగా మారడానికి కొన్ని సూక్ష్మక్రిములు మాత్రమే అవసరం.
- శీతలపానీయాలు తీసుకోవడం చాలా ప్రమాదం
- రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారాలను తీసుకోవాలి.

బాగా వర్షాలు పడుతుంటే... ఈ జాగ్రత్తలు మేలు

- సాధ్యమైనంత వరకూ బయటకు వెళ్లకుండా ఉండటమే శ్రేయస్కరం
- ప్రయాణాలను వాయిదా వేసుకోవడం ఉత్తమం
- వరద ప్రవాహాన్ని దాటేందుకు ప్రయత్నించరాదు
- వర్షం వస్తున్నప్పుడు చెట్ల కింద ఉండరాదు
- వర్షంలో తడవడం, చిన్నపిల్లలు వర్షంలో ఆడకుండా చూసుకోవాలి
- విద్యుత్ స్తంభాలు, నియంత్రికలు, వైర్లు, మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలి.
- తడిచిన విద్యుత్ స్తంభాల సపోర్ట్‌వైర్, విద్యుత్ ఉపకరణాలను తాకరాదు
- బట్టలు ఆరేసుకునే తీగకు విద్యుత్‌వైర్లు కలపరాదు
- ట్రాన్‌ఫార్మర్ల వద్ద శబ్దం వస్తే వెంటనే విద్యుత్‌శాఖకు తెలియజేయాలి
- వర్షాలు పడుతున్న సమయంలో విద్యుత్ మోటార్లు ఆన్ చేయరాదు
- గృహాల్లో అతుకులు లేని సర్వీసు వైర్లు మాత్రమే ఉపయోగించాలి
- తెగిపడిన, వేలాడుతున్న తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్‌తీగలను తాకరాదు
- విద్యుత్ మరమ్మతుల కోసం సంబంధిత సిబ్బందికి సమాచారం అందించాలి
- విద్యుత్‌షాక్‌నకు గురైన వ్యక్తిని ముట్టుకోవద్దు వ్యవసాయ పంపుసెట్లను, స్టార్టర్లను విధిగా ఎర్త్ చేయాలి
- విద్యుత్‌శాఖ సిబ్బందిని సంప్రదించి వారి సేవలను పొందాలి

తీర ప్రాంతాల్లో మరింత అప్రమత్తం

రాష్ట్రంలోని నదీ, సముద్ర తీరాల్లోని ప్రజానీకం మరింత అప్రమత్తంగా ఉండాలి. వరద ఉధృతి గురించి వాతావరణ శాఖ సూచించే హెచ్చరికలను అమలు చేయాలి.

- ఆకస్మిక వరద గురించి తెలుసుకోండి
- వరద భద్రతా చర్యలన్నీ తీసుకోండి
- ముంపు ప్రాంతాల్లోకి ప్రవేశించొద్దు
- మీ ఇంటి డ్రెయినేజీ వ్యవస్థను శుభ్రంగా ఎలాంటి అడ్డంకులు లేకుండా ఉంచండి
- ఎలక్ట్రికల్ గాడ్జెట్లు, మెషినరీని అన్‌ప్లగ్ చేయండి..నీటికి దూరంగా ఉంచండి
- తగినంత ఆహారం,త్రాగునీరు నిల్వచేయండి
- గ్యాస్ వాల్వ్‌లు, కనెక్ట్ చేయబడిన పరికరాలను ఆపేయాలి
- కుటుంబాన్ని, పెంపుడు జంతువులను సురక్షిత ప్రదేశాలకు తరలించండి
- అవసరమైన మందులతో కూడిన ప్రథమ చికిత్స పెట్టెను మీ వద్ద ఉంచుకోండి
- వరద నీటి ప్రవేశాన్ని అడ్డుకోవటానికి కాలువల్లో ఇసుక సంచులను వేయొద్దు
- తాగునీరు నిల్వ చేయండి
- కీలకాలు, దోమలపై చెక్ ఉంచడానికి ప్రయత్నించండి
- కీటకాలు మరియు దోమలపై చెక్ ఉంచడానికి ప్రయత్నించండి
- మీ వాహనాలను ఎత్తైన ప్రాంతానికి తీసుకెళ్లండి
- ఇంటిని ఖాళీ చేస్తే వాటిని గ్యారేజీలో ఉంచొద్దు
- విలువైన వస్తువులను ఇళ్లల్లో ఉంచొద్దు
- ముంపు నేపథ్యంలో ప్రభుత్వం ఆదేశిస్తే ఇంటిని ఖాళీ చేయాల్సిరావొచ్చు
- మీ ఇంటిలోపల ఒక టేబుల్ లేదా ఎత్తైన ప్రదేశంలో అన్ని ఫర్నిచర్, బెడ్ మెటీరియల్స్, ఉపకరణాలు ఉంచాలి
- ప్రథమ చికిత్స వస్తు సామాగ్రి, పొడి ఆహారం, తాగునీరు మీ వెంట తీసుకెళ్లండి
- లోతును అర్థం చేసుకోవడానికి నీటిలో నడవడానికి
- కుటుంబ కమ్యూనికేషన్‌ను ప్లాన్ చేయండి

రాష్ట్ర విపత్తుల నిర్వహణాశాఖ సూచనలు

కుండపోత వర్షాల సమయంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖ పలు సూచనలు చేసింది. వరదలతో సహ ప్రకృతి వైపరీత్యాల సమయంలో అవగాహన, భద్రతా చర్యలు పాటించడం, ప్రభుత్వ నిబంధనలు పాటించండి.

- వరద నీటిలోకి ప్రవేశించొద్దు
- మురుగునీటి కాల్వలు, కల్వర్టులకు దూరంగా ఉండండి
- పడిపోయిన విద్యుత్‌లైన్లు, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండండి
- వరద నీటిలో నడవకండి. రెండు అడుగుల మేర ప్రవహించే వరద నీరు పెద్ద కార్లను కూడా తోడుకుపోగలవు.
- వరద ప్రవహించే వాగులు, వంకలు, కాలువలు దాటే ప్రయత్నం చేయకండి
- వేడిచేసిన, క్లోరినేటెడ్ నీటిని తాగండి
- సహాయక చర్యల్లో అధికారులకు సహకరించండి.

బ్యాడ్మింటన్ ఫైనల్‌కు నితీశ్

సెమీస్‌కు మనీషా
పారిస్ పారా ఒలింపిక్స్

పారిస్: పారా ఒలింపిక్స్ పురుషుల సింగిల్స్ ఫైనల్లోకి నితీశ్ ప్రవేశించాడు. ఆదివారం జరిగిన సెమీఫైనల్లో నితీశ్ ఎస్ఎల్-3లో 21-16, 21-12తో జపాన్‌కు చెందిన ఫ్యూజిహరాను ఓడించాడు. ఫైనల్‌కు చేరడం ద్వారా నితీశ్‌కు పతకం ఖాయమైంది. రెండో సెమీస్‌కూ భారత్‌కు చెందిన లాలినయరే-కదమ్ ప్రవేశించడంతో స్వర్ణ, రజత పతకాలు భారత్‌కు దక్కడం ఖాయం. ఇక మహిళల సింగిల్స్ సెమీఫైనల్లోకి మనీషా రాందాస్ ప్రవేశించింది. ఆదివారం జరిగిన క్వార్టర్‌ఫైనల్ ఎస్‌యు-5లో మనీషా 21-13, 21-16తో జపాన్‌కు చెందిన టొయోడా మమికోను ఓడించింది.

పురుషుల షాట్‌పుట్ ఎఫ్-40లో ఆర్. రంగోలి 5వ స్థానానికే పరిమితమయ్యాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో రంగోలి గుండును 10.63మీ. విసిరాడు. ఈ విభాగంలో మొనేరియో(క్రొయేషియా) 11.21మీ. స్వర్ణ పతకం సాధించగా.. టెగ్మెండ్(మంగోలియా) 11.09, తనిష్(ఇరాక్) 11.03మీ. రజత, కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. టేబుల్ టెన్నిస్ మహిళల సింగిల్స్ క్లాస్-4లో బి. పటేల్ క్వార్టర్‌ఫైనల్‌కు చేరింది. ప్రి క్వార్టర్స్‌లో భవినా పటేల్ 11-3, 11-6, 11-7తో మెక్సికోకు చెందిన మర్థాను చిత్తుచేసింది.

ఇక పారా ఒలింపిక్స్ పతకాల పట్టికలో అమెరికా 4వ స్థానానికి ఎగబాకింది. నాల్గోరోజు పోటీలు ముగిసేసరికి అమెరికా 6స్వర్ణ, 10రజత, 5కాంస్యాలతో సహ 21 పతకాలతో 4వ స్థానంలో నిలిచింది.

పతకాల పట్టిక

దేశం	స్వ	ర	కా	మొ
1. చైనా	27	22	9	58
2. బ్రిటన్	19	11	8	38
3. బ్రెజిల్	8	4	13	25
4. అమెరికా	6	10	5	21
5. ఫ్రాన్స్	6	7	10	23
6. ఆస్ట్రేలియా	6	4	8	18
7. నెదర్లాండ్స్	6	2	2	10
8. ఉజ్బెకిస్తాన్	5	3	3	11
9. ఇటలీ	4	4	9	17
26. ఇండియా	1	1	3	5

నోట్: స్వ:స్వర్ణం, ర:రజతం; కా:కాంస్యం; మొ:మొత్తం

ఏడు నెలల గర్భంతో కాంస్యంతో మెరిసిన బ్రిటన్ ఆర్చర్..

పారా ఒలింపిక్స్‌లో బ్రిటన్ ఆర్చర్ గ్రిన్‌హమ్ కాంస్య పతకంతో మెరిసింది. ఇందులో విశేషముంది అనుకుంటున్నారు..? ఆమె మాతత్వపు మాధుర్యాన్ని ఆస్వాదిస్తూనే పట్టుదలతో కాంస్యం సాధించింది. తద్వారా పారాలింపిక్స్‌లో మెడల్ కొల్లగొట్టిన గర్భిణిగా చరిత్ర సృష్టించింది 'కడుపులో కలల పంటను మోస్తూనే పోడియం మీద నిల్చోవడం చాలా సంతోషంగా ఉంద'ని బ్రిటన్ ఆర్చర్ తెలిపింది. పారాలింపిక్స్‌లో ఆమెకు ఇది రెండో పతకం కావడం విశేషం. ఆదివారం జరిగిన కాంస్య పోరులో జోడీకి అసలైన సవాల్ ఎదురైంది. ఎందుకంటే.. టోక్యోలో పసిడితో రికార్డు నెలకొల్పిన ఫొబె పాటెర్‌సన్‌తో ఆమె తలపడింది. అయినా సరే ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వని జోడి గురి పెట్టి బాణాలు సంధించింది. చివరకు ఒకే ఒక పాయింట్ తేడాతో 142-141తో ఫొబె జోడీకి షాక్ ఇచ్చి కాంస్యంతో మురిసింది.

రెండోటెస్ట్‌లో ఇంగ్లండ్ గెలుపు
శ్రీలంకపై 190పరుగుల తేడాతో విజయం

లండన్: లార్డ్ వేదికగా శ్రీలంకతో జరిగిన రెండోటెస్ట్‌లో ఇంగ్లండ్ జట్టు 190పరుగుల తేడాతో విజయం సాధించింది. ఓవర్ నైట్ స్కోర్ 2వికెట్ల నష్టానికి 53పరుగులతో నాల్గోరోజు ఆటను కొనసాగించిన శ్రీలంక జట్టు 383పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో 292పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ కరుణరత్నే(55), ఛండీమాల్(58), ధనుంజయ(50) అర్ధసెంచరీలకి తోడు ప్రియాంత్(43), మాథ్యూస్(36) బ్యాటింగ్‌లో రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లు అట్కిన్సన్‌కు ఐదు, స్టోన్, వోక్స్‌కు రెండేసి, బషీర్‌కు ఒక వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అట్కిన్సన్‌కు లభించింది. తొలి టెస్ట్‌లో ఇంగ్లండ్ 5వికెట్ల తేడాతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో మూడు టెస్ట్‌మ్యాచ్‌ల సిరీస్‌ను ఇంగ్లండ్ మరో టెస్ట్ మిగిలి ఉండగానే 2-0తో చేజిక్కించుకుంది. మూడో, చివరి టెస్ట్ ఓవల్ వేదికగా 6నుంచి జరగనుంది.

ప్రపంచ పవర్ లిఫ్టింగ్‌లో భారత్ జయకేతనం

- పురుషుల జూనియర్ టీమ్ ఛాంపియన్‌షిప్ కైవసం

ప్రజాశక్తి - స్పోర్ట్స్ డెస్కు

ప్రపంచ ఎక్విప్‌డ్ జూనియర్, సబ్ జూనియర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భారత్ విజయకేతనం ఎగురవేసింది. మాల్టాలో జరుగుతున్న ఈ పోటీల్లో జూనియర్ పురుషుల టీమ్ ఛాంపియన్‌షిప్‌ను భారత్ తొలిసారి సొంతం చేసుకుంది. మూడు బంగారు పతకాలను చేజిక్కించుకొని 49 పాయింట్లతో టీమ్ ఛాంపియన్‌గా అగ్రస్థానంలో నిలిచింది. 40 పాయింట్లతో అమెరికా, 39 పాయింట్లతో ఉక్రెయిన్ రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. జూనియర్ మహిళల ఎక్విప్‌డ్ టీం ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఒక బంగారు పతకం, ఒక రజత పతకం సాధించి నాలుగో స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో రాష్ట్రం నుంచి పాల్గొన్న ధోనె మురళీకృష్ణ, షేక్ సాధియా అల్మాస్ బంగారు పతకాలను, సయ్యద్ ఖాజావలి కాంస్య పతకాన్ని సాధించిన సంగతి తెలిసిందే. కాగా పురుషుల టీం ఛాంపియన్‌షిప్ భారత్ కైవసం చేసుకోవడం చరిత్రలో ఇదే తొలిసారి అని పవర్‌లిఫ్టింగ్ ఇండియా అధ్యక్షులు సతీష్ కుమార్, సెక్రటరీ జనరల్ పిజె జోసెఫ్ తెలిపారు. విజేతలకు అభినందనలు తెలిపారు.

ప్రి క్వార్టర్స్‌కు స్వియాటెక్

యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

న్యూయార్క్: యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి టాప్‌సీడ్, పోలండ్‌కు చెందిన ఇగా స్వియాటెక్ ప్రవేశించింది. ఆదివారం జరిగిన మూడోరౌండ్ పోటీలో స్వియాటెక్ 6-4, 6-2తో 25వ సీడ్ పోంపుఛుకోవా(రష్యా)ను వరుససెట్లలో చిత్తుచేసింది. మరో పోటీలో 22వ సీడ్ హడ్డాడ్ మయి 6-3, 6-1తో 15వ సీడ్ కలినిస్కియా(రష్యా)ను ఓడించగా.. అన్‌సీడెడ్, డెన్మార్క్‌కు చెందిన వాజ్నియాకీ 6-3, 6-2తో ఫ్రాన్స్‌కు చెందిన పోంఛెఫ్‌ను చిత్తుచేసింది.

మెద్వదేవ్, పాల్ కూడా..

పురుషుల సింగిల్స్‌లో 5వ సీడ్, రష్యాకు చెందిన మెద్వదేవ్, 14వ సీడ్, అమెరికాకు చెందిన టామీ పాల్ ప్రి క్వార్టర్స్‌కు చేరారు. మెద్వదేవ్ 6-3, 6-4, 6-3తో 31వ సీడ్ కొబొల్లి(ఇటలీ)ను చిత్తుచేయగా.. పాల్ 6-7(5-7), 6-3, 6-1, 7-6(7-3)తో డియాలో(కెనడా)ను ఓడించాడు. మరో ఐదుసెట్ల హోరాహోరీ పోరులో అన్‌సీడెడ్, బొర్గెస్(పోర్చుగల్) 6-7(5-7), 6-1, 3-6, 7-6(8-6), 6-0తో మెన్సిక్(చెక్‌రిపబ్లిక్)ను ఓడించి ప్రి క్వార్టర్స్‌కు చేరాడు. మరో పోటీలో టాప్‌సీడ్ సిన్నర్(ఇటలీ) 6-1, 6-4, 6-2తో కానెల్(ఆస్ట్రేలియా)ను, 4వ సీడ్ జ్వెరేవ్(జర్మనీ 5-7, 6-5, 6-1, 6-3తో ఎట్జెవెర్రీ(అర్జెంటీనా)ను ఓడించారు. మూడోరౌండ్‌లో స్టార్ ఆటగాడు నొవాక్ జకోవిచ్‌ను ఓడించిన పోపోరిన్(ఆస్ట్రేలియా) ప్రి క్వార్టర్స్‌లో 20వ సీడ్ టఫీ(అమెరికా)తో సోమవారం తలపడనున్నాడు.

పురుషుల డబుల్స్‌లో 2వ సీడ్, రోహన్ బొప్పన్న-మాథ్యూ ఎబ్డెన్(ఆస్ట్రేలియా) జంట ప్రి క్వార్టర్స్‌కు చేరింది. శనివారం జరిగిన రెండోరౌండ్ పోటీలో వీరు 6-2, 6-4తో స్పెయిన్-అర్జెంటీనా జంటపై వరుససెట్లలో విజయం సాధించారు. మరో పోటీలో ఎన్ బాలాజీ-ఆండెరెజ్జి(అర్జెంటీనా జంట 6-7(4-7), 4-6తో 8వ సీడ్ వీనెస్(ఆస్ట్రేలియా)-స్కుప్కీ(బ్రిటన్) జంట చేతిలో ఓడారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68